Bhavani Publication Trust https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక

కావలెను

ప్రజాతీర్పు
The people's Verdict
తెలుగు జాతీయ దినపత్రిక
The Largest Circulated Telugu Fortnightly

సామాజిక, రాజకీయాలపై అవగాహన ఉన్న ఉత్సహావంతులైన యువకులు జర్నలిస్టులుగా ఎదిగే గొప్ప సదావకాశం..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రజాతీర్పు దినపత్రికలో తెలంగాణలోని అన్ని జిల్లాల్లో పని చేయడానికి స్టాఫ్ రిపోర్టర్లు, కంట్రిబ్యూటర్లు, అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్లు, సర్క్యులేషన్ ఇన్‌చార్జిలు కావలెను

వెంటనే కావలెను
• బ్యూరో ఇన్‌చార్జిలు • స్టాఫ్ రిపోర్టర్లు
ఆర్‌సి ఇన్‌చార్జిలు • మండల రిపోర్టర్లు

అనుభవం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
ఆసక్తి ఉన్న వారు మీ పూర్తి బయోడేటా ఈ వాట్సాప్ నంబర్‌కు పంపగలరు
8309979541, 9885353018, 9494659622

సంపుటి : 26 | సంచిక : 285 | హైదరాబాద్ | శుక్రవారం 28 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR



# మళ్లీ బీజేపీదే అధికారం

ఇప్పుడే ఎన్నికలు జరిగితే ఎన్డీయేకు 326 సీట్లు

- ఇండియా కూటమికి తాజా సర్వేలో 185 సీట్లు
- మళ్లీ ప్రథమ స్థానంలో మోదీనే!

మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వేలో వెల్లడి

**న్యూఢిల్లీ, ఆగస్టు 27 (ప్రజాతీర్పు)**

ఇప్పటికిప్పుడు దేశంలో ఎన్నికలు జరిగితే మరోసారి బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే అధికారంలోకి వస్తుందని తాజా మూడ్ ఆఫ్ ది నేషన్(ఎంఓటీఎన్) సర్వే స్పష్టం

- మిగతా 2వ పేజీలో



# కేటీఆర్‌కు ప్రతిష్ఠాత్మక ఆహ్వానం

## జిందాల్ గ్లోబల్ వర్సిటీకి రావాలని ఆహ్వానం

## విద్యార్థులతో సంభాషించాలని విజ్ఞప్తి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్కు మరో ప్రతిష్ఠాత్మక ఆహ్వానం అందింది. హర్యానాలోని ప్రముఖ ఓ.పీ. జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీకి విచ్చేసి విద్యార్థులు, అధ్యాపకులతో సంభాషించడంతో పాటు వారిని ఉద్దేశించి 'డిస్టింగ్విష్డ్ పబ్లిక్ లెక్చర్' ఇవ్వాలని యూనివర్సిటీ కేటీఆర్ను ఆహ్వానించింది. జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ (డాక్టర్) సి. రాజ్ కుమార్ ఈ మేరకు కేటీఆర్కు ప్రత్యేకంగా లేఖ రాశారు. కేటీఆర్ రాక, ఆయన ఆలోచనలు, ప్రసంగం విద్యార్థులకు ఎంతో స్ఫూర్తి, ప్రేరణ కలిగిస్తాయని పేర్కొన్నారు.

**(ప్రజాతీర్పు ప్రతినిధి, రంగారెడ్డి జిల్లా)**

కేటీఆర్కు అనుకూలమైన తేదీ, సమయాన్ని బట్టి సెప్టెంబర్, అక్టోబర్ 2026లో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన భారత్లోనే తొలి రాజ్యాంగ మ్యూజియం, రైట్స్ అండ్ ఫ్రీడమ్స్ అకాడమీని సందర్శించాలని కూడా కేటీఆర్ను ఆహ్వానించారు. భారత రాజ్యాంగం ఆమోదానికి 75 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ రాజ్యాంగ మ్యూజియంలో రాజ్యాంగ నిర్మాణ సమయంలో ఎదురైన పోరాటాలు, సవాళ్లు, రాజ్యాంగ నిర్మాతల కృషిని ప్రతిబింబించేలా ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. 2009లో స్థాపించిన ఓ.పీ. జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ ప్రస్తుతం దేశంలోని ప్రముఖ బహుళ విభాగాల, పరిశోధనాధారిత విద్యా సంస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ఇక్కడ 16 వేల మందికిపైగా విద్యార్థులు, 1,100 మందికిపైగా పూర్తిస్థాయి అధ్యాపకులు ఉన్నారు. 50కి పైగా దేశాలకు చెందిన అధ్యాపకులు, 160 దేశాలకు చెందిన విద్యార్థులతో అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందిన ఈ విశ్వవిద్యాలయం, ప్రపంచవ్యాప్తంగా 80 దేశాల్లోని 600కు పైగా ప్రముఖ సంస్థలతో భాగస్వామ్యాలు కలిగి ఉంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయి ర్యాంకింగ్స్లోనూ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ విశేష గుర్తింపు సాధించింది. టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆన్లైన్ లెర్నింగ్ ర్యాంకింగ్స్ – 2024లో గోల్డ్ రేటింగ్ పొందడంతో పాటు, క్యూఎస్, టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్లో వివిధ విభాగాల్లో ప్రముఖ స్థానాలు దక్కించుకుంది. 2020లో భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ నుంచి 'ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఎమినెన్స్' హోదాను కూడా పొందింది. గతంలో రాష్ట్రపతులు, ఉప రాష్ట్రపతులు, భారత ప్రధాన న్యాయమూర్తులు, కేంద్ర మంత్రులు, గవర్నర్లు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సహా పలువురు ప్రముఖులు జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కేటీఆర్ ఈ ఆహ్వానాన్ని స్వీకరించి యూనివర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులతో తన ఆలోచనలను పంచుకుంటారని యూనివర్సిటీ

- మిగతా 2వ పేజీలో



# కొండా ప్లాన్ బీ ఏమిటీ?

## రాజకీయాల్లో ఇప్పుడిదే చర్చ

- మౌనం పాటిస్తున్న మంత్రి సురేఖ
- అధిష్ఠానం నిర్ణయం కోసం వెయిటింగ్
- అప్పటికీ మౌనమే పాటిస్తారా? లేక..
- ఆ తర్వాతే తదుపరి కార్యచరణ

**(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)**

తెలంగాణ రాజకీయాల్లో మంత్రి కొండా సురేఖ ఫ్యామిలీ ఇప్పుడు హాట్ టాపిక్. ఆమె విషయంలో పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై విస్తృత చర్చ జరుగుతోంది. ఇన్ని వివాదాలకు కేంద్రబింధువైన మంత్రి కొండా సురేఖ మాత్రం పూర్తిస్థాయి మౌనం పాటిస్తున్నారు. బెంగళూరు వెళ్లి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు తన వైఖరిని,

- మిగతా 2వ పేజీలో



# ఎస్400ల కోసం పాక్ వేగుల్ని నియమించింది!

## ఎయిర్‌మార్షల్ జితేంద్ర మిశ్రా

ఆపరేషన్ సింధూర్‌లో ఎస్400లదే కీలకపాత్ర

**న్యూఢిల్లీ, ఆగస్టు 27 (ప్రజాతీర్పు)**

ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంలో కీలకపాత్ర పోషించిన ఎస్400 రక్షణ వ్యవస్థల కోసం పాకిస్థాన్ తెగ ప్రయత్నం చేసిందని, ఆఖరికి ప్రత్యేక గూడచారులు, స్లీపర్ సెల్‌ల సాయంతో వాటిని

- మిగతా 2వ పేజీలో

# టూరిజం హబ్‌గా 'మీరాలం'

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఆకస్మికంగా చెరువు పనుల పరిశీలన


చారిత్రక ప్రాధాన్యం కలిగిన మీరాలం చెరువుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త రూపునివ్వనుంది. కుటుంబ సమేతంగా వచ్చి రోజంతా ప్రకృతి, వినోదం, విశ్రాంతిని ఆస్వాదించేలా పర్యాటక, వినోద కేంద్రంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఈక్రమంలో మీరాలం చెరువును సీఎం రేవంత్‌రెడ్డి గురువారం ఆకస్మికంగా పరిశీలించి, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. చెరువు చుట్టూ జరుగుతున్న పనులు, మీరాలం చెరువుపై నిర్మిస్తున్న ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి పనులను సీఎం పరిశీలించారు.



**హైదరాబాద్, ఆగస్టు 27 (ప్రజాతీర్పు)**

నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. చెరువు పునరుజ్జీవం, చెరువు పరిసర ప్రాంతాలు, అందులోని ఐలాండ్ల అభివృద్ధి, చెరువుపై ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం.. ఈ మూడు ప్రధాన అంశాలపై సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. అయితే, మీరాలం చెరువులోకి మురుగునీరు చేరకుండా పటిష్ట చర్యలు తీసు కోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. చెరు వు నుంచి మూసీ నదిలోకి వరద నీరు సాఫీగా వెళ్లేలా నాలాలను విస్తరించాలని సూచించారు. చెరువు పునరుజ్జీవంతో పాటు నీటి నాణ్యతను మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మీరాలం చెరువులో వాటర్ స్పోర్ట్స్ నిర్వహించేలా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని, అవసరమైన సాంకేతిక, పర్యావరణ, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా బోటింగ్, జల క్రీడలు, అడ్వెంచర్ కార్యకలాపాలకు అవకాశాలను పరిశీలించాలన్నారు.చెరువు చుట్టూరా ఫుడ్‌కోర్టులు, పచ్చని పార్కులు, విశ్రాంతి ప్రదేశాలు, కుటుంబ వినోద సదుపాయాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. చిన్నారుల కోసం ప్రత్యేక ఆట స్థలాలు, వినోద, కార్యకలాపాల కేంద్రాలను కూడా అభివృద్ధి చేయాలన్నారు. పాదచారులకు అనుకూలంగా వాకింగ్, పబ్లిక్ స్పేస్‌లను తీర్చిదిద్దడంతో పాటు రాకపోకల సౌకర్యాన్ని మెరుగుపరచాలన్నారు. చెరువులో ఉన్న ఐలాండ్లను అభివృద్ధి చేయాలని, ప్రకృతి ఆధారిత విశ్రాంతి కేంద్రాలు, గ్లాంపింగ్, ఇతర పర్యాటక కార్యకలాపాలకు ఈ ప్రాంతాన్ని వినియోగించుకునే

- మిగతా 2వ పేజీలో



# మళ్లీ తెరపైకి పునర్విభజన!

## వర్షాకాల సమావేశాలు ప్రొరోగ్ కాలేదు

- మళ్లీ సమావేశాలు జరపటం ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది
- పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి రిజిజు
- నియోజకవర్గాల పునర్విభజన, మహిళా బిల్లుపై కేంద్రం కసరత్తు

- 2లో



# మరణమృదంగం

## ప్రకృతి ప్రళయానికి 392కు చేరిన మృతుల సంఖ్య

- 1,600 మంది గల్లంతు.. 290మంది భారతీయుల ఆచూకీ లేదు
- మానసరోవర్ యాత్రలో చైనా వైపు చిక్కుకున్న మరో 200 మంది భారతీయులు
- ఈశా ఫౌండేషన్ సభ్యుల్లో 80 మంది అదృశ్యం
- తెలంగాణ నుంచి 22 మంది మిస్సింగ్: పొంగులేటి

- 2లో

# జీవో 97ను రద్దు చేయాలి

## పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపై అసెంబ్లీని స్తంభింపజేస్తాం

- అవసరమైతే ఢిల్లీలో కదం తొక్కుతాం
- ఉద్యోగుల జోలికొస్తే పతనం తప్పదు
- మాజీమంత్రి హరీశ్‌రావు
- వరంగల్ పర్యటన ఉద్రిక్తం




**మహబూబాబాద్, ఆగస్టు 27 (ప్రజాతీర్పు)**

పాలిటెక్నిక్ విద్యార్థులకు నష్టం కలిగించే జీవో 97ను వెంటనే రద్దు చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. జీవోనే వెనక్కి తీసుకోకపోతే విద్యార్థుల సమస్యలపై అసెంబ్లీని స్తంభింపజేస్తామని, అవసరమైతే ఢిల్లీలో కదం తొక్కుతా మని హెచ్చరించారు. గురువారం హరీశ్‌రావు వరంగల్ పర్యటన ఉద్రిక్తంగా సాగింది. హైదరాబాదు నుంచి వరంగల్ బయలుదేరిన హరీశ్‌రావు తొలుత హనుమకొండ కలెక్టరేట్ వద్ద ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చకుండా, అవసరం లేని పనులకు వేల కోట్ల రూపాయలు నిధులు ఖర్చు చేస్తుందని మండిపడ్డారు. ఉద్యోగులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం కూడా మనుగడ సాగించలేదన్నారు. అనంతరం

- మిగతా 2వ పేజీలో

# మళ్లీ తెరపైకి పునర్విభజన!

న్యూఢిల్లీ, ఆగస్టు 27 (ప్రజాతీర్పు)



నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), మహిళా రిజర్వేషన్ల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఇటీవల ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను ప్రభుత్వం ఇంకా అధికారికంగా ముగించకపోవడం (ప్రోరోగ్ చేయకపోవడం) వెనుక పెద్ద వ్యూహామే ఉందనే చర్చ నడుస్తోంది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు తాజాగా చేసిన వ్యాఖ్యలు ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూర్చాయి. మరోవైపు, డీలిమిటేషన్‌పై ప్రభుత్వానికి ఉన్న ప్రణాళిలను ప్రతిపక్షాలతో పంచుకోవాలని, మరో 25 ఏళ్లపాటు లోక్‌సభ సీట్లను పెంచవద్దని కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే గురువారం ఒక లేఖ రాశారు. తృణమూల్ కాంగ్రెస్, శివసేన (యూబీటీ), ఆమ్ ఆద్మీ పార్టీలలో జరిగిన వరుస ఫిరాయింపుల నేపథ్యంలో, వర్షాకాల సమావేశాల్లో ప్రభుత్వం డీలిమిటేషన్ బిల్లును తిరిగి ప్రవేశపెట్టడానికి ప్రయత్నిస్తుందని ఊహాగా నాలు వచ్చాయి. కానీ, కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమంతో వెనక్కి తగ్గినట్లు ప్రచారం జరిగింది. అయినప్పటికీ, డీలిమిటేషన్ బిల్లు కోసం కసరత్తును కేంద్రం ఆపలేదని, పూర్తి మెజారిటీని సాధించేందుకు పావులు కదుపుతోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. కిరెణ్ రిజిజు వ్యాఖ్యలు, మోదీకి ఖర్గే లేఖ రాయడం.. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలపై ఊహాగానాలకు బలాన్ని చేకూరుస్తున్నాయి.

### సమావేశాలు ప్రోరోగ్ కాలేదు

ఓ ఇంటర్వ్యూలో మంత్రి కిరెణ్ రిజిజు మాట్లాడుతూ.. పార్లమెంట్‌ను మళ్లీ సమావేశపరిచే అవకాశం ఉందనే సంకేతాలు ఇచ్చారు. వర్షాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయే తప్ప, అధికారికంగా ప్రోరోగ్ కాలేదని ఆయన గుర్తుచేశారు. 'హౌస్‌ను ప్రోరోగ్ చేయనప్పుడు, సమా వేశాల్ని మళ్లీ జరపటం పెద్ద కష్టమేమీ కాదు. ఇది పూర్తిగా ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది' అని తెలిపారు. ప్రత్యేక సమావేశాల నిర్వహణపై నేరుగా స్పందించనప్పటికీ.. 1952 నుంచి మన దేశ పార్లమెంటు చరిత్రలో ఇలాంటి సందర్భాలు అనేకం ఉన్నాయని ఆయన పేర్కొనటం గమనార్హం. గత ఏప్రిల్‌లో జరిగిన ప్రత్యేక సమావేశాల్లో మూడింట రెండు వంతుల మెజారిటీ రాక వీగిపోయిన డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లులను మళ్లీ ఇదే సెషన్‌లో ముందుకు తెస్తారనే ప్రచారం జరుగుతోంది.

### లోక్‌సభ స్థానాలను స్తంభింపజేయాలి

వచ్చే 25 ఏళ్ల వరకు లోక్‌సభ సీట్ల సంఖ్యను పెంచవద్దని, రాష్ట్రాల వారీగా ప్రస్తుత ప్రాతినిధ్యాన్నే కొనసాగించాలని ప్రధాని మోదీని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కోరారు. డీలిమిటేషన్ అంశంపై చర్చించేందుకు వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ప్రధానికి ఒక లేఖ రాశారు. 'నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాద నలపై చర్చించడానికి అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహించాలని గత నెల 16నే మీకు (ప్రధానికి) లేఖ రాశాను. మీరు భావిస్తున్నట్లుగా పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి బిల్లులను ప్రవేశపెట్టాలనుకుంటే.. మొదట ఆ ప్రతిపాదనలను కూలంకషంగా అధ్యయనం చేయడానికి పార్టీలకు, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన సమయం ఇవ్వాలి. బుధవారం రాత్రి పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు ఓ టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. వర్షాకాల సమావేశాలను ప్రోరోగ్ చేయకుండా ఇందుకే ఆపినట్లుగా కనిపిస్తోంది. దీంతో మా వినతిని పునరుద్ఘాటిస్తూ మీకు మళ్లీ లేఖ రాస్తున్నాను' అని ఖర్గే తెలిపారు. డీలిమిటేషన్ అనేది దేశానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని, ఇంతటి ముఖ్యమైన విషయం మీద.. ప్రతిపక్షాలను ఈ ఏడాది ఏప్రిల్ 16, 17 తేదీల్లో (ప్రత్యేక సమావేశాల్లో) మాదిరిగా బుల్డోజ్ చేసే ప్రయత్నాలు చేయవద్దన్నారు. అన్ని రాజకీయపార్టీలతో సం ప్రదింపులు జరపకుండా ఏకపక్షంగా ముందుకె ళ్లొద్దన్నారు. లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న 543 సంఖ్యా బలాన్ని, రాష్ట్రాల వారీగా ఉన్న సీట్ల కేటాయింపును మరో 25 ఏళ్లపాటు అలాగే కొనసాగించాలని పేర్కొన్నారు. 20 29 లోక్‌సభ ఎన్నికల్లో మహిళలకు మూడోవంతు రిజర్వేషన్లు కల్పించే బిల్లును ప్రవేశ పెట్టాలని ఖర్గే డిమాండ్ చేశారు.

# కొండా ప్లాన్ బీ ఏమిటీ?

ఎదురవుతున్న పరిణామాలను వివరించి వచ్చిన ఆమె ఎలాంటి అడుగులు వేస్తారు. ఆమె మదిలో ప్లాన్ బీ ఏదైనా ఉందా అన్న ఉత్కంఠ నెలకొంది.

**అధిష్ఠానం నిర్ణయం ఏమిటో?**

మంత్రి కొండా సురేఖ తనయ చేసిన వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని స్వయంగా ఆమె వివరణ ఇచ్చారు. ఆమె భర్త కొండా మురళీ సైతం డిప్యూటీ సీఎంతో భేటీ అయ్యారు. మరోపక్క తన శాఖలోని అధికారులను తనకు తెలీకుండానే మాతృశాఖలకు పంపడం, ఓఎస్డీ సెటిల్మెంట్ల వ్యవహారంలో చట్టపరమైన విచారణలు వేగవంతం కావడం వంటి అంశాలపై సురేఖ తన అసంతృప్తిని ఇప్పటికే హైకమాండ్ ముందు ఉంచారు. అధిష్టానానికి పరిస్థితిని వివరించిన తర్వాత, తన బాధ్యత ముగిసిందన్నట్లుగా ఓ రోజు సెక్రటేరియట్‌లో విధులు నిర్వహించిన ఆమె.. ఇప్పుడు వెయిట్ అండ్ సీ ధోరణిని అవలంబిస్తున్నారు. కాంగ్రెస్ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకోబోతోంది? తనను కేబినెట్ నుంచి తప్పిస్తుందా లేక నష్ట నివారణ చర్యలు చేపడుతుందా అనే అంశం ఆధారంగానే సురేఖ దంపతులు తమ తదుపరి అడుగులు వేయనున్నారు.

**సవాళ్లకు సిద్ధం**

కొండా సురేఖ కుటుంబానికి సవాళ్లు కొత్త కాదు. ఆమె రాజకీయ ప్రస్తానం దగ్గర నుంచి చూసిన వారికి ఈ విషయం తెలుసు. కొండా సురేఖ ప్రస్తుత నిశ్శబ్దం అధిష్టానం నిర్ణయంపై ఆధారపడి ఉంది. ఒకవేళ అధిష్టానం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాలకే మొగ్గు చూపి, ఆమెతో బలవంతంగా మంత్రి పదవికి రాజీనామా చేయిస్తే పరిస్థితి ఏంటి అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. గత చరిత్రను పరిశీలిస్తే కొండా సురేఖ దంపతులు ఏ పార్టీలో ఉన్నా తమ స్వయంప్రతిపత్తిని, ఆత్మగౌరవాన్ని వదులుకునేందుకు సిద్ధపడలేదు. కేవలం మంత్రి పదవి ఊడిపోవడమే కాకుండా పార్టీలో ప్రాధాన్యత తగ్గితే.. ఆమె కేవలం కాంగ్రెస్‌లోనే ఉండిపోతారా లేక ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేసి తమ సొంత నియోజకవర్గం వరంగల్ తూర్పులో సవాలు విసురుతారా అనేది కీలక ప్రశ్న. అలాగే, మంత్రి పదవిని కోల్పోతే ఎమ్మెల్యే పదవికి సైతం రాజీనామా చేసి బై-ఎలక్షన్ కు వెళ్లే సాహసం కొండా మురళి, సురేఖ దంపతులు చేయవచ్చనే టాక్ వరంగల్ రాజకీయాల్లో గట్టిగా వినిపిస్తోంది. తమకున్న బలమైన బీసీ కేడర్, వ్యక్తిగత ఇమేజ్‌ను నమ్ముకుని ఉపఎన్నికకు వెళ్లడం ద్వారా సీఎం రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి రాజకీయ సవాలు విసిరే అవకాశం ఉంది. ఒకవేళ కాంగ్రెస్ తమపై కఠిన చర్యలు తీసుకుంటే, బిసి సెంటిమెంట్‌ను క్షేత్రస్థాయిలోకి బలంగా తీసుకెళ్లేందుకు ఈ ఉపఎన్నిక మార్గాన్ని ఎంచుకోవచ్చు అన్న చర్చ జరుగుతుంది. కొండా సురేఖ మౌనం అనేది తుఫానుకు ముందు ఉండే నిశ్శబ్దం లాంటిది. అధిష్టానం ఇచ్చే ఫైనల్ రిపోర్టు లేదా తీసుకునే నిర్ణయమే తెలంగాణ కాంగ్రెస్‌లో మరో రాజకీయ ఆధిపత్య రగడకు దారితీస్తుందా లేదా అనేది తేల్చనుంది. కొండా దంపతుల తదుపరి అడుగు కాంగ్రెస్ పార్టీకి వరంగల్ రీజియన్‌లో మునుపటి కంటే పెద్ద సవాలుగా మారే ప్రమాదం ఉందని అనుకోవచ్చు.



# టూరిజం హబ్‌గా 'మీరాలం'

(మొదటి పేజీ తరువాయి)

అవకాశాలను అధికారులను పరిశీలించాలని సీఎం చెప్పారు. వెడ్డింగ్, ఈవెంట్ డెస్టినేషన్ల ఏర్పాటుకు కూడా ప్రణాళికలు సిద్ధం చేసే అంశంపై దృష్టి సారించాలన్నారు. నాణ్యమైన పర్యాటక, వినోద సదుపాయాల అభివృద్ధిలో పీపీపీ విధానంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించి ఉపాధి అవకాశాలు కల్పించాలని వెల్లడించారు. సమీపంలోని నెహ్రూ జూలాజికల్ పార్కుతో మీరాలం ట్యాంక్ అభివృద్ధిని అనుసంధానం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జూ సందర్శన, ప్రకృతి, చెరువు అందాలు, కుటుంబ వినోదం అన్నీ ఒకే పర్యాటక అనుభవంగా అందించడమే లక్ష్యంగా ఉండాలని చెప్పారు. ట్యాంక్ పునరుజ్జీవం, పరిసర ప్రాంతాలు, ఐలాండ్ల అభివృద్ధికి సంబంధించిన డీపీఆర్ ప్రస్తుతం రూపుదిద్దుకుంటుందన్నారు.

# నేపాల్‌లో మరణమృదంగం

న్యూఢిల్లీ, ఆగస్టు 27 (ప్రజాతీర్పు)

ప్రకృతి ప్రళయానికి నేపాల్‌లో మరణమృందంగం మోగుతోంది. ఆకస్మిక భారీ వరదల్లో మృతుల సంఖ్య 392కి చేరింది. మృతుల్లో 389 మంది నేపాల్‌లో, మరో ముగ్గురు టిబెట్‌లో మరణించారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. దాదాపు 1,600 మంది గల్లంతయ్యారు. ఈ జలవిలయంలో 290 మంది భారతీయులు గల్లంతయ్యారు. అలాగే కైలాష్ మానసరోవర్ యాత్రలో ఉన్న దాదాపు మరో 200 మంది భారతీయులు చైనా వైపు చిక్కుకుపోయారని విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) గురువారం తెలిపింది. తమిళనాడుకు చెందిన 21 మందిని రక్షించినట్లు ఎంఈ ఏ, నేపాల్ పోలీసులు తెలిపారు. గల్లంతైన పర్యాటకుల సంఖ్యలో భారతదేశం అగ్రస్థానంలో ఉండగా, ఆ తర్వాత అమెరికా నుంచి 65 మంది, ఉక్రెయిన్ నుంచి 53 మంది, మలేషియా నుంచి 51 మంది ఉన్నారు. టిబెట్‌లో 558 మంది గల్లంతైనట్లు సమాచారం. వీరిలో 260 మంది విదేశీయులు ఉన్నారని చైనా ప్రభుత్వ మీడియా వెల్లడించింది. నేపాల్‌కు కొత్త వరద ముప్పు అతిత్వరలోనే ఉందని చైనా హెచ్చరించింది. నేపథ్యంలో, 37.5 టన్నుల మానవతా సహాయ సామాగ్రి (హెచ్ఏడీఆర్), మందులు, ఆహార ప్యాకెట్లతో కూడిన రెండో విడత సహాయాన్ని భారత్ నేపాల్‌కు అప్పగించిందని విదేశాంగ మంత్రిత్వ శాఖ గురువారం తెలిపింది. 300 మంది ఈశా ఫౌండేషన్ సభ్యుల్లో 80 మంది అదృశ్యమయ్యారని, ఈ సంఘటన తనను తీవ్రంగా కలిచివేసిందని ఆధ్యాత్మిక గురువు సద్గురు జగ్గీ వాసుదేవ్ కన్నీరు పెట్టారు. 'మేం క్షేమంగానే ఉన్నామని డీఆర్డీవో మాజీ చైర్మన్ సతీశ్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ నుంచి 22 మంది పర్యాటకులు మిస్సయ్యారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. కొండచరి యలు విరిగిపడటంతో వరదలు సంభవించి, బీభత్సాన్ని సృష్టించాయి. నేపాల్ టిబెట్ సరిహద్దు ఆ ప్రాంతాలను అతలాకుతలం చేశాయి. భారీ ఆకస్మిక వరద వల్ల భోటేకోషి, త్రిశూలి నదీ పరీవాహక ప్రాంతా ల గుండా తీవ్ర విధ్వంసం జరిగింది. ఇళ్లు, రోడ్లు, వంతెనలు ధ్వంసమ య్యాయి. విశాలమైనప్రాంతాలు బురద, రాళ్లు, శిథిలాలతో నిండిపోయాయి. రసువా, నువాకోట్లలో అత్యంత తీవ్రమైన నష్టం జరిగింది. రసువాలోని తిమురే, రసువాగధిలో, భోటేకోషి నది వెంబడి ఉన్న నివాసాలకు, మౌలిక సదుపాయాలకు వరద తీవ్ర నష్టం కలిగించింది. ఈ రెండు పట్టణాలు నేపాల్- సరిహద్దుకు సమీపంలో ఉన్నాయి. నువాకోట్‌లోని బెట్రావతి నుంచి రాసువాగఢి వరకు ఉన్న 42 కిలోమీటర్ల రహదారి మొత్తం పలుచోట్ల దెబ్బతిన్నదని, అనేక కాంక్రీట్ వంతెనలు కొట్టుకుపోయా యని రహదారుల శాఖ తెలిపింది. అలాగే నువాకోట్‌లోని దిగువన, త్రిశూలి బజార్, సమీప ప్రాంతా లలో విధ్వంసం చాలా తీవ్రంగా ఉంది. ఈ వరద త్రిశూలి, దేవిఘాట్ జలవిద్యుత్ ప్రాజెక్టులతో పాటు ఇతర విద్యుత్ మౌలిక సదుపాయా లను కూడా దెబ్బతీసింది. వరదల కారణంగా 35 వంతెనలు, 45 వేలాడే వంతెనలు, 40 కిలోమీటర్ల రహదారులు దెబ్బతిన్నాయని నేపాల్ జాతీయ విపత్తు ప్రమాద తగ్గింపు నిర్వహణ సంస్థ తెలిపింది.

అత్యంత తీవ్రంగా దెబ్బతిన్న కొన్ని ప్రాంతాలలో గల్లంతైన వారి కోసం సహాయక బృందాలు గాలిస్తున్నాయి. నేపాల్ భారత్, చైనాల సహా యాన్ని కోరింది. భారీ విధ్వంసం, కఠినమైన భూభాగం సహాయక చర్యలను క్లిష్టతరం చేస్తున్నా యి. విపత్తు నిర్వహణ సంస్థ ప్రకారం, రసువా, నువాకోట్, ధాడింగ్, గోర్ఖా, తనాహున్, చిత్వాన్, నవల్పరాసి జిల్లాల నుంచి మృతదేహాలను వెలికితీశారు. భోటేకోశి, త్రిశూలి, నారాయ ణి వంటి ప్రధాన నదుల ఒడ్డుకు దూరంగా ఉండాలని ప్రజలను హెచ్చరించారు.

వినాశకరమైన వరదల అనంతరం సహాయక చర్యలకు మద్దతుగా భారత్ నేపాల్‌కు 47 టన్నుల మానవతా సహాయా న్ని అందజేసింది. అలాగే భారీ వరదల కారణంగా ముందస్తు జాగ్రత్త చర్యగా, ఢిల్లీ ప్రభుత్వం 'భారత్- మైత్రీ బస్సు సేవల'ను నేడు, రేపు (28, 29 తేదీల్లో) తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ మేరకు గురువారం ఢిల్లీ రవాణా సంస్థ (డీటీసీ) ఉత్తర్వు జారీ చేసింది. నేపాల్ విలయంపై ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరెస్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సహాయక చర్యల కోసం ప్రపంచ సంస్థ తొలి విడతగా 2 మిలియన్ డాలర్లను కేటాయించింది. నేపాల్‌లోని రసువా జిల్లాలో భోటే కోషి నది పుట్టుక ప్రాంతం (మూలం) స మీపంలో ఒక కొత్త అడ్డంకి సరస్సు ఏర్పడి ంది. దీంతో ఆ నది దిగువ ప్రాంతాల్లో మళ్లీ వరద ముప్పు పొంచి ఉందని చైనా హెచ్చరించింది. ఆ సరస్సు ఇప్పటికే పొంగిపొర్లుతోందని, రాబోయే రోజుల్లో మరింత నీరు చేరడంతో అది తెగిపోయే ప్రమాదం ఉందని బీజింగ్ ఆందోళన వ్యక్తం చేసినట్లు చైనా సెంట్రల్ టెలివిజన్ (సీసీటీవీ)ని ఉటంకిస్తూ ది కాఠ్మండు పోస్ట్ గురువారం పేర్కొంది. గురువారం ఉదయానికి ఈ సరస్సులో సుమారు 20 లక్షల (2 మిలియన్ల) క్యూబిక్ మీటర్ల నీరు చేరిందని, రాబోయే మూడు రోజు ల్లో మరో 30 లక్షల క్యూబిక్ మీటర్ల నీరు వచ్చి చేరే అవకాశం ఉందని చైనా అధికారులు అంచనా వేస్తున్నారు. దీనివల్ల సరస్సు కట్ట తెగిపోయే ప్రమాదం ఉం దనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. నేపాల్‌లో సంభవించిన తీవ్రమైన ఆకస్మిక వరదల కారణంగా ప్త్రశీట మంది భారతీయులు ఆచూకీ లేకుండా పోయారని విదేశీ వ్యవహారాల శాఖ గురువారం తెలిపింది. 53 మంది కేరళీయులు చిక్కుకుపోయారని 'నోర్కా రూట్స్' తెలిపింది. తమిళనాడుకు చెందిన 21 మందిని రక్షించామని ఎంఈఏ చెప్పింది. నిర్మాణంలో ఉన్న త్రిశూలి-1 రన్-ఆఫ్-రివర్ జలవిద్యుత్ ప్రాజెక్టులో పనిచేస్తున్న 63మంది కార్మి కులతో సహా మొత్తం 84మంది భారతీ యులను రక్షించారు. తమిళనాడు, పుదుచ్చేరి నుంచి మొత్తం 106 మంది మానస సరోవర్ యాత్రకు వెళ్లారు. వీరిలో 86 మంది గల్లంతయ్యారు. మరో 37 మంది ఆచూకీ ఇంకా తెలియరాలేదు. చెన్నై నుంచి బయలుదేరిన మరో 49మంది ఆచూకీ తెలియలేదు. గుజరాత్‌కు చెందిన 11 మంది గల్లంతయ్యారు. ఒక మహిళ ప్రాణాలతో బయటపడింది. పశ్చిమ బంగాల్‌కు చెందిన 32మంది గల్లంతయ్యా రని సీఎం సువేందు అధికారి తెలిపారు. ఒడిశాకు చెందిన ఒక ఎన్ఆర్ఐ జంట అదృశ్యమైంది. ఖుర్దా జిల్లాకు చెందిన సందీప్ మహాపాత్ర, ఆయన భార్య సిద్ధార్థి కుమారి సాహు గల్లంతయ్యా రని పేర్కొన్నారు. తెలంగాణ నుంచి 23 మంది పర్యాటకులు గల్లంతయ్యారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నేపాల్‌లో గల్లంతైన 23 మందిలో ఆరుగురు రాష్ట్రానికి చెందిన వారుగా, 17మంది ప్రవాస తెలంగాణ అని పేర్కొన్నారు. వీరిలో ఒకరు సురక్షితంగా ఉన్నారని మిగతా 22మంది ఆచూకీ కోసం చర్యలు తీసుకుంటున్నామని అన్నా రు.

# మళ్లీ బీజేపీదే అధికారం

(మొదటి పేజీ తరువాయి)

చేసింది. గత సర్వేతో పోలిస్తే ఎన్డీయే బలంలో కొంత తగ్గుదల కనిపించింది. తాజా అంచనాల ప్రకారం.. నేడే లోక్‌సభ ఎన్నికలు జరిగితే ఎన్డీయే కూటమికి 326 సీట్లు వస్తాయని అంచనా వేసింది. జనవరిలో నిర్వహించిన గత సర్వేలో ఎన్డీయేకు 352 సీట్లు వస్తాయని అంచనా వేయగా, తాజా సర్వేలో 26 సీట్లు తగ్గాయి. అయినప్పటికీ, మ్యాజిక్ ఫిగర్‌ను దాటి మెరుగైన సీట్లను సాధిస్తుందని చెప్పింది. అయితే, ఎన్డీయే మద్దతు కొంత మేర క్షీణిస్తుందని సర్వే అంచాన వేసింది. మరోవైపు కాంగ్రెస్ నేతృత్వం లోని ఇండియా కూటమి సీట్లలో పెద్దగా మార్పు కనిపించలేదు. తాజా సర్వేలో ఇండియా కూటమికి 185 సీట్లు వస్తాయని అంచనా వేయగా.. జనవరి 2026 ఎంఓటీఎన్ సర్వేలో ఈ సంఖ్య 182గా ఉంది. ఓట్ షేర్ ప్రకారం చూస్తే బీజేపీకి 39 శాతం, కాంగ్రెస్ కు 21 శాతం ఓట్లు వస్తాయని అంచనా వేసింది. అయితే ఎన్డీఏ కూటమి బలం తగ్గుదల వెనుక నీట్ ఎగ్జామ్, రామ మందిర విరాళాల చోరీ, ఈ20 పెట్రోల్ తదితర కారణాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గత 2024 లోక్సభ ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా ఇచ్చిన '400 పార్' (400 దాటుతాం) నినాదానికి తాజా అంచనాలు దూరంగా ఉన్నప్పటికీ, 'జెన్ జెడ్' ఓటర్ల రూపంలో సవాళ్లు ఎదురవుతున్నా ఎన్డీఏపై ప్రజల్లో విశ్వాసం చెక్కుచెదరలేదని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ సర్వే ప్రకారం విపక్ష 'ఇండియా' కూటమి సీట్లలో భారీగా పెరుగుదల ఏమీ కనిపించ లేదు. కాంగ్రెస్ నేతృత్వంలోని ఈ ప్రతిపక్ష కూటమికి ప్రస్తుతం 185 సీట్లు వచ్చే అవకా శం ఉందని తాజా సర్వే పేర్కొంది. ఇది గత జనవరి సర్వేలోని 182 సీట్లతో పోలిస్తే స్వల్పంగా 3 సీట్లు మాత్రమే ఎక్కువ. అయి తే, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి సాధించిన 234 సీట్లతో పోలిస్తే ఇది భారీ తగ్గుదలే కావడం గమనార్హం.

### ప్రథమ స్థానంలో మోదీనే..!

తాజాగా సీఓటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సర్వే నీట్ విషయంలో జెన్ జీ ఆం దోళన అనంతరం నిర్వహించడం విశేషం. జూలై 1 నుంచి ఆగస్టు 25 మధ్య 25,184 మంది ప్రత్యక్ష అభిప్రాయాలను సేకరించా రు. దీనికి అదనంగా సీఓటర్ క్రమం తప్పకుండా నిర్వహిం చే ట్రాకర్ ద్వారా గడిచిన ఆరు నెలల్లో సేకరించిన 91,795 ఇంటర్వ్యూలను కూడా విశ్లేషించి ఈ అంచనాలను ఖ రారు చేశారు. ఈ అంచనాల్లో ప్రధానమం త్రి పదవికి అత్యంత తగిన వ్యక్తిగా మరోసారి మోదీనే ప్రథమ స్థానంలో నిలిచారు.

# కేటీఆర్‌కు ప్రతిష్ఠాత్మక ఆహ్వానం

(మొదటి పేజీ తరువాయి)

వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి. యూనివర్సిటీ విద్యార్థులతోపాటు అధ్యాప కులతో సంభాషించేందుకు ఆహ్వానం పంపినందుకు ధన్యవాదాలు తెలిపిన కేటీ ఆర్... విద్యార్థులతో సంభాషించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని, కచ్చి తంగా యూనివర్సిటీ పంపిన ఆహ్వానం మేరకు హాజరు అవుతానని కేటీఆర్ తెలిపారు.

# ఎస్400ల కోసం పాక్ వేగుల్ని నియమించింది!

(మొదటి పేజీ తరువాయి)

గుర్తించే ప్రయత్నం జరిగిందని విశ్రాంత ఎయిర్‌మార్షల్ జితేంద్ర మిశ్రా వెల్లడించారు. ఎస్400ల కారణంగానే పాకి స్థాన్ ఫైటర్‌జెట్లు సరిహద్దుకు 200 కిలోమీటర్ల దగ్గరకు కూడా రాలేకపోయాయని ఆయన ఏఎన్ఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. అత్యాధునిక ఎస్400లు ఆపరేషన్ సిందూర్‌లో అత్యంత సమర్థంగా పనిచేశాయని, పాకిస్థాన్‌లోని సర్గోదా నుంచి నింగికి ఎగిరిన అవాక్ రాడార్ విమానాన్ని 314 కిలోమీటర్ల దూరం నుంచే గుర్తించి కూల్చేసిందని ఆయన తెలిపారు. అంత దూరంలోని విమానాన్ని కూల్చేయడం సైనిక చరిత్రలో ఒక రికార్డు అని చెప్పారు. భారత వాయుసేన మొదట పాకిస్తాన్ గ్రౌండ్ రాడార్లు, కమాండ్‌అండ్‌కంట్రోల్ కేంద్రాలను ధ్వంసం చేసిందని, దాంతో పాక్ సేనలకు ఏమీ కనిపించని పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. దీంతో పాక్ రాడార్ విమానాలపై ఆధారపడ్డాయని, ఎస్400లు వాటిని కూడా కూల్చేయడంతో విజయం సులభమైందని వివరించారు. ఈ ఆపరేషన్‌లో మహిళా ఫైటర్ పైలట్లు ఒకటి కంటే ఎక్కువ మిషన్లు నిర్వహించారని, మురిద్కేలోని లష్కరే తోయిబా ప్రధాన కేంద్రం, వైమానిక స్థావరాలు, కమాండ్‌అండ్‌కంట్రోల్ కేంద్రాలను నాశ నం చేయడంలో కీలకపాత్ర పోషించారని మిశ్రా తెలిపారు. పహల్‌గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ గత ఏడది మేలో ఆపరేషన్ సింధూర్‌ను చేపట్టింది. భారత్ నూర్ ఖాన్, భోలారి వంటి కీలక స్థావరాలు సహా 11 మిలిటరీ స్టేషన్లను ధ్వంసం చేసిన తరువాత పాకిస్తాన్ కాల్పుల విరమణకు అభ్యర్థించిన విషయం తెలిసిందే. ఆపరేషన్ సందర్భంగా ప్రభుత్వం నుంచి ఎలాంటి అడ్డంకులు ఎదురు కాలేదని జితేంద్ర మిశ్రా స్పష్టం చేశారు. పౌర నష్టాలు నివారించాలని, ఉగ్రవాదులు, హ్యాండ్లర్లనే లక్ష్యంగా చేసుకోవాలన్న సూచనలు మాత్రం వచ్చాయన్నారు. 2018లో భారత్‌రష్యాల మధ్య కుదిరిన ఒప్పందంలో భాగంగా మనకు ఎస్400 వ్యవస్థలు అందుబాటులోకి వచ్చాయి.



# జీవో 97ను రద్దు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

వరంగల్‌లో పాలిటెక్నిక్ విద్యార్థులకు సంఘీభావం తెలపడానికి బయలుదేరగా పోలీసులు హరీశ్‌రావును అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, బీఆర్ఎస్ శ్రేణులకు మధ్య తోపులాట జరిగింది. హరీష్‌రావును రక్షక్ వాహనంలో ఎక్కించడానికి పోలీసులు విశ్వప్రయత్నం చేసినా సాధ్యం కాకపోవడంతో కాలినడకన సమీపంలోని పోలీస్‌స్టేష న్‌కు తరలించారు. హరీశ్‌రావుతో పాటు మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, హనుమకొండ పశ్చిమ మాజీ దాస్యం వినయ భాస్కర్‌ను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలుసుకున్న పాలిటెక్నిక్ విద్యార్థులు.. పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని ఆందోళనకు దిగారు. తీవ్రమైన జన సందోహం మధ్య ఒత్తిడికి గురైన హరీశ్‌రావు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఈ సమయంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆధ్వర్యంలో విద్యార్థులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. కొద్దిసేపటి తర్వాత చేరుకున్న హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక చర్యలకు పాల్పడుతుందని, ఏ రంగానికి కూడా ప్రభుత్వం మేలు చేసిన దాఖలాలు లేవని మండిపడ్డారు. ఉద్యోగులకు దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో ఆరు డీఏలు పెండింగ్ లో ఉన్నాయని విమర్శించారు.

ప్రభుత్వానికి ఉద్యోగులు వెన్నెముక లాంటి వారిని, అలాంటి వారికి డీఏలు ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. అలాగే అంగన్‌వాడీ కార్యకర్తలకు ఒక్క రూపాయి జీతం కూడా పెంచలేదని, ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పూర్తిగా అంగన్‌వాడీ టీచర్లే నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. వారి కష్టానికి తగ్గ ఫలితం దక్కడం లేదని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేశజాలకు పోకుండా జీవో 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ రాష్ట్రంలో పాలిటెక్నిక్ విద్యార్థులు ఆందోళన చేస్తుంటే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. పాలిటెక్నిక్ విద్యార్థుల పక్షాన బీఆర్ఎస్ కొట్లాడుతుందని హామీ ఇచ్చారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మహాధర్నా

**కరీంనగర్ టౌన్, ఆగస్టు 27 (ప్రజా తీర్పు)**

దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, నాలుగో తరగతి ఉద్యోగులు, డ్రైవర్లు, పోలీస్ సిబ్బంది, అంగన్వాడీలు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఎదుట గురువారం మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి, జేఏసీ కన్వీనర్ మడిపల్లి కాళీ చరణ్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని, పి ఆర్ సి అమలు, పెండింగ్లో ఉన్న డీఏ లు, డీఆర్ ల విడుదల, సిపిఎస్ సమస్య పరిష్కారం, ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన ఇతర దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, ఎడ్ల అరవింద్ రెడ్డి, పెన్షనర్ల సంఘం అధ్యక్షులు కేశవరెడ్డి, ఉస్మాన్ పాషా, ఈశ్వరయ్య అశోక్




రావు ఎండి సలీం కరుణాకర్ రెడ్డి ఎలదాసరి లింగయ్య రామస్వామి శంకర్ ముప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి, రవీందర్ రెడ్డి, రాగి శ్రీనివాస్, సర్దార్ హర్మీందర్ సింగ్, రాజేష్ భరద్వాజ్, సుమంత్ రావు, శారద, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల క్షేమాన్ని పూర్తిగా మరిచిన రేవంత్ ప్రభుత్వం

## మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

**కరీంనగర్ టౌన్, ఆగస్టు 27 (ప్రజా తీర్పు)**

రేవంత్ ప్రభుత్వం అలవిగాని అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి, ప్రజల క్షేమాన్ని పూర్తిగా మరిచిపోయిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ రూరల్ మండలం నగునూరు గ్రామంలో ఎస్డీఎఫ్ నిధులు 10 లక్షలతో గ్రామంలో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న మల్లికార్జున స్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. తన వంతు సహాయంగా ఒక లక్ష రూపాయల విరాళాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో రాష్ట్రం పదేళ్లపాటు అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోయిందని, అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లారని గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో ఇస్తున్న సంక్షేమ పథకాలతో పాటు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కింద తులం బంగారం ఇస్తామని ఆశ చూపి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రజలను మోసం చేసిన ఏ ప్రభుత్వమైనా గద్దె దిగక తప్పదన్నారు. రానున్న రెండేళ్లలో బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని, కేసీఆర్ నేతృత్వంలో ప్రజలకు మళ్లీ సుపరిపాలన అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఫ్యాక్స్ చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, నగునూరు సర్పంచ్ సాయిల్ల శ్రావణి మహేందర్, ఉప సర్పంచ్ హనుమంత రావు, నాయకులు పాషా, రవితేజ, దిలీప్, భద్రయ్య, శ్రీనివాస్, సుదర్శన్రెడ్డి, రంగారెడ్డి, శ్యామ్ పాల్గొన్నారు.



# అల్ఫోర్స్‌లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**కరీంనగర్ టౌన్, ఆగస్టు 27 (ప్రజా తీర్పు)**

కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ- టెక్నో పాఠశాలలో ముందస్తు రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ భారత దేశంలో రక్షాబంధన్ పండుగకు ప్రత్యేకత ఉన్నదని, మతసామరస్యాన్ని, సోదర భావాన్ని సైతం పెంపొందిస్తుందన్నారు. సోదరులు సోదరీమణులకు అండగా నిలుస్తామని, ఎల్లప్పుడూ రక్షణగా ఉంటామని ప్రతిజ్ఞ చేస్తారని, ఇది గొప్ప సాంప్రదాయమని చెప్పారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# 22-ఏ బాధితులకు అండగా ఉంటాం: ఎంపీ ఈటల రాజేందర్

- నేరేడ్‌మెట్, ఆర్.కె.పురంలో బాధితులను పరామర్శించిన మల్కాజ్‌గిరి ఎంపీలి
- రిజిస్ట్రేషన్లు కాక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామంటూ రోదించిన బాధితులు

**(వినోద్, ప్రజా తీర్పు,?నేరేడ్‌మెట్, మేడ్చల్ జిల్లా) ఆగస్టు 27**

మల్కాజ్‌గిరి నియోజకవర్గం పరిధిలోని నేరేడ్‌మెట్, ఆర్.కె. పురం ప్రాంతాలలో 22-ఏ (నిషేధిత భూముల జాబితా) జీవో కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులను మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ స్వయంగా కలిసి పరామర్శించారు. ?ఈ సందర్భంగా బాధితులు తమ ఇళ్లు, ప్లాట్లను నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత భూముల జాబితాలో చేర్చడం వల్ల రిజిస్ట్రేషన్లు జరగక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎంపీ ఎదుట తమ గోడును వెళ్లబోసుకున్నారు. కష్టపడి సంపాదించుకున్న ఆస్తులపై హక్కులు లేక అనేక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల సమస్యలను ఓపికగా విన్న ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. 22-ఏ జీవో వల్ల ప్రజలు పడుతున్న అవస్థలపై అధికారులతో మాట్లాడి త్వరితగతిన న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. బాధితులకు అన్ని వేళలా అండగా ఉంటామని, ఈ సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాడతానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో బీజేపీ కార్యకర్తలు, నాయకులు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# 6వ వార్డులో ఘనంగా వనమహోత్సవం

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు) ఆగస్టు 27**



ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో స్థానిక కౌన్సిలర్ రేఖ - కమల్ కోరి ఆధ్వర్యంలో వనమహోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ.. వనమహోత్సవం ద్వారా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెరుగుతుందని, మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి, దానిని సంరక్షించాలని, పచ్చదనం పెంపొందించడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సందీప్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పట్టణ, మండల అధ్యక్షులు, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలుపెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# పోలీస్‌స్టేషన్‌లో రాఖీ పౌర్ణమి వేడుకలు

- సీఐ, పోలీసు సిబ్బందికి రాఖీలు కట్టిన శివాని స్కూల్ విద్యార్థినులు

**నర్సంపేట టౌన్ ఆగస్టు 27 ప్రజా తీర్పు ప్రతినిధి**

నర్సంపేట: రాఖీ పౌర్ణమి సందర్భంగా నర్సంపేట పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో గురువారం గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో ని శివాని పాఠశాల విద్యార్థినులు సందడి చేశారు. పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న విద్యార్థినులు సిఐ ముష్క శ్రీనివాస్ పాటు పోలీసు సిబ్బందికి రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాస్ విద్యార్థినులతో ఆప్యాయంగా ముచ్చటించారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థినులు పోలీసు సిబ్బందికి రాఖీలు కట్టి తమ అభిమానాన్ని చాటుకోవడం ఆనందంగా ఉందని సీఐ తెలిపారు. విద్యార్థినులు మాట్లాడుతూ సమాజ రక్షణ కోసం విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి రాఖీలు కట్టడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ గిరగాని రాహుల్ వర్మ, ఉపాధ్యాయిని లు ప్రియాంకా, నందిని, దివ్య పోలీసు సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



# సర్ గ్రామసభలను పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు లక్కినేని శ్యాంబాబు

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు) ఆగస్టు 27**

టేకులపల్లి :టేకులపల్లి మండలంలో సర్ గ్రామసభలను పరిశీలించిన టేకులపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు.లక్కినేనిశ్యాంబాబు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఖాదర్ బాబు ,జిల్లా ప్రధాన కార్యదర్శి కాలే ప్రసాద్.ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు టేకులపల్లి మండలంలోని 36 గ్రామపంచాయతీలలో జరుగుతున్న సర్ గ్రామసభలను టేకులపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్కినేని శ్యాంబాబు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఖాదర్ బాబు ,జిల్లా ప్రధాన కార్యదర్శి కాలే ప్రసాద్ పరిశీలించారు.ఈ సందర్భంగా బోడు,ఆర్ సి పేట, కొప్పురాయి,తదితర గ్రామపంచాయతీ ల్లో నిర్వహించిన గ్రామసభల్లో పాల్గొని సర్ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు.గ్రామసభల్లో ఓటర్ల జాబితాలను పరిశీలించే సమయంలో అర్హత కలిగిన ఒక్క ఓటరు పేరు కూడా తొలగిపోకుండా జాగ్రత్తగా పరిశీలించాలని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, సర్పంచులకు సూచించారు.అలాగే డూప్లికేట్/డబుల్ ఓట్లు, మరణించిన వారి ఓట్లు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన ఓట్లు వంటి అంశాలను గుర్తించినట్లయితే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, నిబంధనల ప్రకారం ఫిర్యాదు చేయాలని సూచించారు.ప్రతి అర్హత కలిగిన ఓటరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా, సర్ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరియు ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని శ్యాంబాబు కోరారు.



# మృతుని కుటుంబాన్ని పరామర్శించిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

**నర్సంపేట టౌన్ ఆగస్టు 27 ప్రజా తీర్పు ప్రతినిధి**

నల్లబెల్లి మండలం రుద్రగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గేదె కరుణాకర్ ఇటీవల గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందడం అత్యంత విషాదకరం. ఈ సందర్భంగా నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి వారి నివాసానికి వెళ్లి కరుణాకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ధైర్యంగా ఉండాలని ఓదార్పునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల యువజన కాంగ్రెస్ నాయకులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# జీతాలకు పరిమితం.. విధులు నిర్వహించడంలో శూన్యం!

- ఎక్కడున్నారు అధికారులు.. నాయకులు? ఇళ్లకే పరిమితమవుతున్న పారిశుద్ధ్య సిబ్బంది

**షాపూర్ నగర్, ఆగస్టు 27,ప్రజా తీర్పు**

మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించడానికే పరిమితమవుతున్న అధికారులు, వారికి అప్పగించిన విధులు సక్రమంగా నిర్వహించేలా ఎందుకు పర్యవేక్షించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కాలనీలు, ప్రధాన రహదారులు, నివాస ప్రాంతాల్లో చెత్త పేరుకుపోవడంతో తీవ్ర దుర్వాసన వస్తోందని ప్రజలు వాపోతున్నారు. చెత్త కుప్పల కారణంగా దోమలు విపరీతంగా పెరిగి చిన్నారులు, వృద్ధులు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న పారిశుద్ధ్య సమస్యపై అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు కళ్లు



తెరిచి పారిశుద్ధ్య వ్యవస్థను గాడిలో పెట్టాలని, విధులకు గైర్హాజరవుతున్న సిబ్బందిపై పర్యవేక్షణ పెంచి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు



# గీతాంజలి పాఠశాలలో ఘనంగా ప్రీ రాఖీ వేడుకలు

**నర్సంపేట టౌన్ ఆగస్టు 27 ప్రజా తీర్పు ప్రతినిధి**

అన్నా చెల్లెల్ల పవిత్ర ప్రేమానురాగాలకు రక్షణ బంధానికి ప్రతీకగా శ్రావణ పౌర్ణమి రోజున రాఖీ పండుగను ఘనంగా నిర్వహించుకుంటారు అన్నదమ్ములకు జీవితంలో ఎలాంటి ఆపదలు రాకుండా ఉన్నత శిఖరాలను చేరాలని కోరుతూ చేతికి కట్టే పవిత్రమైన రక్షణే ఈ రాఖీ దీనిని భారతీయులు కేవలం దారంలా కాకుండా తోబుట్టువుల మధ్య ఉండే ఆప్యాయతకు విశ్వాసానికి బాధ్యతకు మరో రూపం గా ఈ రక్షాబంధన్ ధరిస్తారు. ఈ రక్షణ జీవితాంతం కల్పిస్తామని చెప్పకనే చెబుతుంది ఈ రాఖీ. అందుకోసం అన్నదమ్ములు వారి తోబుట్టువులను ఎంతో అపురూపంగా మరో తల్లిగా భావిస్తారు. ఈ పవిత్రమైన రోజును పురస్కరించుకొని గీతాంజలి పాఠశాలలో ప్రీ రాఖీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు తమ తోటి విద్యార్థులకు రాఖీలు కట్టి వారి మధ్య బాంధవ్యాన్ని మరింత బలోపేతం చేసుకుని ఒకరికొకరు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల ప్రిన్సిపల్ ఎన్ రాజేష్ మాట్లాడుతూ భారతదేశం ఎంతో పవిత్రమైన దేశమని అందులో అతి పవిత్రంగా జరుపుకునే పండుగలలో రక్షాబంధన్ ఒకటని పేర్కొన్నారు లాగైతే ఒక తండ్రి తన కన్న పిల్లలను కంటికి రెప్పలా ఏ ఆపదనైనా లెక్కచేయకుండా కాపాడుకుంటాడో అలాగే తోడబుట్టిన వారు కూడా ఎలాంటి ఆపద ఎదురైన వారి అక్క చెల్లెల్ల దరిచేరకుండా కంచెలా ఒక రక్షణలా నిలబడతాడని ఈ పండుగను ఇలా అందరూ కలిసికట్టుగా జరుపుకోవడం ఎంతో ఆనందదాయకమని తెలిపారు ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొని మహిళ ఉపాధ్యాయులచే రాఖీలు కట్టించుకుని ఒకరికొకరు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలుపుకొని ఆనందించారు.




# దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మండల స్థాయి ఆటల పోటీలు

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజా తీర్పు) ఆగస్టు 27**

టేకులపల్లి: దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని టేకులపల్లి మండలంలో దివ్యాంగ విద్యార్థులకు మండల స్థాయి ఆటల పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖాధికారి అజ్మీరా జగన్ హాజరై విద్యార్థులను అభినందించారు. కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ ఏ. మోహన్‌రావు, ఎంపీపీఎస్ పాఠశాల హెడ్‌మాస్టర్ వెంకయ్య, వాలమ్మ,నరేష్, సిడబ్ల్యూఎస్ఎన్ కోఆర్డినేటర్ రవీందర్‌బాబు, నీరజ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.



# ఉద్యమకారుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సంతాప సభ

- సభలో పాల్గొన్న జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ మేరుగు శివకోటి యాదవ్

**నర్సంపేట టౌన్ ఆగస్టు 27 ప్రజా తీర్పు ప్రతినిధి**

నర్సంపేట రాజకీయాల్లో చరిత్రలో నిలిచిన నాయకుడు ఒకరు "మద్దికాయల ఓంకార్" అయితే,మరొక నాయకుడు "పెద్ది సుదర్శన్ రెడ్డి వారితో నాకున్న అనుబంధం చాలా తక్కువ అయిన,వారు నాకు ఇచ్చిన స్ఫూర్తి చాలా గొప్పది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో నాకు ప్రతికూల పరిస్థితులు ఎదురై నిరాశ నిస్పృహలతో ఉన్నప్పుడు బాధపడకు సోదరా నేనున్నానని భరోసా కల్పించిన మా పార్టీ నాయకుడు ఒకరు "ఆర్కే సాగర్( ఆర్ కె నాయుడు)" అయితే,అదేవిధంగా ఆదరించి నీ కష్టం వృథాకాదు సోదరా నేనున్నానని నాలో ధైర్యం నింపిన మరొక పార్టీ నాయకుడు"పెద్ది సుదర్శన్ రెడ్డి సాధారణ మధ్యతరగతి వాళ్ళు కూడా రాజకీయాల్లోకి రావచ్చు,ఒక పార్టీ భావజాలాన్ని అంటిపెట్టుకొని సంకల్పబలంతో,పోరాట పటిమతో ముందుకు వెళ్తే విజయం సాధించవచ్చునని నిరూపించి నాలాంటి యువతకు స్ఫూర్తినిచ్చిన వ్యక్తి పెద్ది సుదర్శన్ రెడ్డి నర్సంపేట నియోజకవర్గంలో వ్యవసాయం,సాగునీరు, విద్య,వైద్యరంగ అభివృద్ధికి తనదైన ముద్ర వేసిన వ్యక్తి పెద్ది సుదర్శన్ వారు మన మధ్య లేకపోయినా ప్రజల గుండెల్లో ఎప్పటికీ ఉంటారు.వారి ప్రజా ఉద్యమ పోరాట స్ఫూర్తి మన అందరికీ ఆదర్శం. అలాగే ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బొబ్బ పృథ్వీరాజ్, ఎలబోయిన డేవిడ్,వివిధ పార్టీల, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# చక్కెర ధర ఎక్కువ ఉంటేనే మంచిది

పండుగ సీజన్ సమీపిస్తుండగా చక్కెర ధరల పెరుగుదలపై ప్రతిపక్షాల నుంచి విమర్శలు వస్తున్న నేపథ్యంలో మధ్యప్రదేశ్ మంత్రి కైలాస్ విజయ్‌వర్గీయ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. చక్కెర ధరలు చాలా ఎక్కువగా ఉండాలని, అలాగే 40 ఏండ్లు పైబడినవారు దీనిని మానేయాలని వ్యాఖ్యానించారు. ఈరోజుల్లో 90 శాతం మంది ప్రజలు స్వీట్లను ఇష్టపడటం లేదని, తాను కూడా వాటిని తినడం పూర్తిగా మానేశానని ఆయన చెప్పారు. బుధవారం ఇండోర్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఏది ఏమైనా చక్కెర ధరలు చాలా ఎక్కువగా ఉంటేనే మంచిదని వ్యాఖ్యానించారు.

# సమ్మె ఉద్యోగుల చివరి అస్త్రం..

## మాజీ మంత్రి, బి ఆర్ ఎస్ రాష్ట్ర కార్యదర్శి టి. జీవన్ రెడ్డి.

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఆగస్టు 27**




జగిత్యాల జిల్లా జె ఎ సీ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ విభాగాల ప్రభుత్వ ఉద్యోగులూ,ఉపాధ్యాయులు, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు తమ సాధన కోసం జగిత్యాల జిల్లా కలెక్టరేటు ఎదుట గురువారం మహా ధర్నా ను నిర్వహించిన మహా ధర్నా కుమాజీ మంత్రి వర్యులు, బీ ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి కోరుట్ల ఎమ్మెల్యే సంజయకుమార్, జెడ్పీ తొలి మాజీ ఛైర్పర్సన్ దావా వసంత తో కల్సి ఉద్యోగుల మహా ధర్నా శిబిరాన్ని సందర్శించి, సంఘీభావం తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టో లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచి, వెయ్యి రోజులు గడుస్తున్న అమలు చేయడామ్ లేదు.

### సమ్మె ఉద్యోగుల చివరి అస్త్రం.

తెలంగాణ ఉద్యమంలో ఉద్యమించిన ఉద్యోగుల హక్కులకు కేసీఆర్ అండగా నిలిచారు. దేశంలో ఎక్కడలేని విధంగా స్థానికులకు 85 శాతం రిజర్వేషన్ అమలు చేశారు. పీ ఆర్ సి ఇంక్రిమెంట్ కాదు.. మార్కెట్ ధరలకు అనుగుణంగా పీఆర్ సి ఇవ్వాల్సి ఉండగా, పీఆర్ సి, ఆరు డి ఏ లు పెండింగ్ లో పెట్టడం బాధాకరం. విద్యా ప్రాథమిక హక్కుగా భారత్ రాజ్యంగ నిర్మాత అంబేద్కర్ రాజ్యాంగంలో నిర్దేశించారు. కేసీఆర్ హయాంలో 600 లకు పైగా గురుకుల పాఠశాలు ప్రారంభించారు. కేసీఆర్ మండలానికి ఒక గురుకుల పాఠశాల ప్రారంభిస్తే, రేవంత్ రెడ్డి పాఠశాలలు మూసి వేసి, ఒకే చోట చేర్చుతున్నారు.

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ విధి విధానాలు స్పష్టం చేయడం లేదు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు ఎప్పుడూ వస్తాయో తెలియని పరిస్థితి.. రాష్ట్ర వ్యాప్తంగా 600 మంది కంప్యూటర్ ఆపరేటర్లు తొలగించారు. ఉద్యోగాల కోసం తెలంగాణ తెచ్చుకుంటే రేవంత్ రెడ్డి ఉన్నవి తొలగిస్తున్నారు. ఓ పీ ఎస్ అమలు చేయాలని విధానంపై శాసన మండలిలో మాట్లాడినట్లు జీవన్ రెడ్డి గుర్తు చేశారు. ఉద్యోగులు చెల్లిస్తున్న 10 శాతం ప్రభుత్వం చెల్లిస్తున్న 10 శాతం ఏటు పోతున్నది. స్మార్ట్ రేషన్ కార్డు లో కేవలం కుటుంబ యజమాని పేరు మాత్రమే ఉంది. రేవంత్ రెడ్డి.. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫోటోలు మాత్రమే..ఉండడం రేషన్ కార్డు కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం కార్డు లా ఉంది.. జగిత్యాల లో ఆరంభించిన ఏ ఉద్యమం అయినా విజయవంతం అవుతుంది.. పంచాయతీ సమితి అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుండి ఉన్న రక్షణను ఇటీవల ప్రభుత్వం తొలగిస్తే బీ ఆర్ ఎస్ పార్టీ రక్షణ కల్పిస్తుంది. జాబ్ క్యాలెండర్ జాడ లేదు.. రాష్ట్రంలో కేవలం 17 వేలు భర్తీ చేసి, 70 వేలు భర్తీ చేశామని చెప్పుకుంటున్నారు. రేవంత్ రెడ్డికి పాలన చేత కావడం లేదు.... రేవంత్ రెడ్డి పోవాలి.. కేసీఆర్ రావాలి అనే నినాదం జగిత్యాల గడ్డ మీద పుట్టింది.. ఉద్యోగులు, యువత తో పెట్టుకున్నా వారు ఎవరు పేరుకు రాలేదు.. ఉద్యోగులకు అండగా బీ ఆర్ ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది.. రాబోయే బీ ఆర్ ఎస్ సర్కారు లో మొదటి సంతకం ఉద్యోగుల సమస్యల పరిష్కారం పై కేసీఆర్ పెడతారని జీవన్ రెడ్డి అన్నారు. విశ్రాంత ఉద్యోగులను రోడ్ల పైకి తీసుకువచ్చిన ప్రభుత్వానికి చీకటి రోజులు తప్పవని హెచ్చరించారు. పీ ఆర్ సి ఉద్యోగుల హక్కు..ఉద్యోగులు గొంతెమ్మ కోరికలు కోరడం లేదని, న్యాయమైన కోరికలు తీర్చాలని అన్నారు. ఐదేళ్ల పీ ఆర్ సీ లో ఇప్పటికే మూడేళ్లు గడిచిపోయింది తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న స్ఫూర్తి తో న్యాయమైన డిమాండ్లు సాధించుకునేదాక ఉధృతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఎమ్మెల్యే డా. సంజయ్, టి ఎన్ జి ఓ జిల్లా అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి, బైరం హరి కిరణ్, మాజీ కౌన్సిలర్ గాజుల రాజేందర్, చేటుపల్లి సుధాకర్, వెంకటేశ్వరరావు, కరబుజ రవీందర్ గౌడ్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



# ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలి

**కోరుట్ల, ఆగస్టు 27 (ప్రజాతీర్పు)**

ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని, సమగ్ర ఓటర్ జాబితా సవరణ కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు, తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు.కోరుట్ల పట్టణంలోని 13వ వార్డులోని 143, 145 బూత్‌లు, 6వ వార్డులోని 125, 126, 127 బూత్‌ల పరిధిలో ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ా×=) కార్యక్రమంపై వార్డు సభ నిర్వహించారు. 13వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్, 6వ వార్డు కౌన్సిలర్ మేడిపల్లి శిరీష శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ముఖ్య అతిథులుగా హాజరైన జువ్వాడి నర్సింగరావు, మానాల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో బాధ్యత తీసుకొని ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను ప్రత్యేక చొరవతో పూర్తి చేయాలని సూచించారు. ఓటర్ జాబితాలో పేరు లేకపోతే సంబంధిత ధ్రువపత్రాలను బీఎల్‌ఓలకు అందజేసి నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు.నూతన ఓటర్ల నమోదుకు ఫారం--6, ఓటర్ జాబితాలో మార్పులు, సవరణలకు ఫారం--8, అభ్యంతరాల నమోదుకు ఫారం--7 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రజలకు అవగాహన కల్పించారు.రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి వార్డులో వార్డు సభలు నిర్వహిస్తూ ఓటర్ జాబితా సవరణ, మ్యాపింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్ షహీద్, కౌన్సిలర్లు అన్నం అనిల్, ఎడ్ల రమేష్, తోట గంగాధర్, బీఎల్‌ఓలు గంగుల అరుణ, హిమగిరి, వార్డు ఆఫీసర్ రవళి, బీఎల్‌ఏ వోలెపు రాజేష్, వార్డు ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా స్వామ్యంలో ఓటు విలువైన ఆయుధం...

– ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఆగస్టు 27.**

ఓటు హక్కును ప్రాధాన్యత ను గుర్తించండి,ప్రతి ఒక్కరూ సమగ్ర ఓటర్ సవరణలో భాగస్వామ్యం కావాలి. ప్రజా స్వామ్యం లో ఓటు హక్కు ప్రధాన ఆయుధమని జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ అన్నారు. ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ లో భాగంగా జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామంలో ఎస్ ఐ ఆర్ కార్యక్రమం పై గురువారం జరిగిన గ్రామసభ లో పాల్గొన్న జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ గారు. నూతన ఓటర్ ల నమోదు ఫారం 6,ఓటర్ లిస్ట్ సవరణ ఫారం 8 ,అభ్యంతరాలకు ఫారం 7 ద్వారా ఇవ్వాలని అవగాహన కల్పిస్తూ నిర్వహించిన వార్డు సభ లో పాల్గొనడం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గం లో 81వేల ఓట్లు నమోదు కాలేదు... ప్రజా ప్రతినిధులు,అధికారులు బాధ్యత తీసుకొని ఓటరు మ్యాపింగ్ చొరవ చూపాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఓటరు జాబితా సవరణ కోసం మ్యాపింగ్ కోసం ప్రతి వార్డు గ్రామ సభ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఓటు జాబితా లో ప్రజలు వారి ఓటు లేనిచో సంబంధిత ధ్రువ పత్రాన్ని బి ఎల్ ఓ లకు అందజేయాల్సి ఉంది అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య శ్రీనివాస్,ఆర్డీవోమధుసూదన్,ఎమ్మార్వో రామ్మోహన్, ఎంపిడిఓ విజయ లక్ష్మీ, మాజీ ఏ ఎం సి ఛైర్మెన్ దామోదర్ రావు,ఉప సర్పంచ్ బాలే శ్రీనివాస్, వార్డు సభ్యులు,మాజీ సర్పంచ్ ప్రభాకర్, మాజీ ఉప సర్పంచ్ మహేష్,ఖఎఏ డైరెక్టర్ నరేష్,నాయకులు,ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శవంతంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నాటక ప్రదర్శన

- సామాజిక సమానత్వం, రాజ్యాంగ స్ఫూర్తిని చాటిచెప్పిన 'సంఘం శరణం గచ్ఛామి
- కార్యక్రమాన్ని ప్రారంబిశీ చిన ఏరియా .జి ఎం.వీసం కృష్ణయ్య

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆగస్టు 27 (ప్రజా తీర్పు)**




టేకులపల్లి: ఇల్లందు ఏరియాలోని టేకులపల్లి సింగరేణి కాలనీ సి.ఇ.ఆర్. క్లబ్‌లో సింగరేణి కాలరీస్ కంపెనీ సహకారంతో హైదరాబాద్‌కు చెందిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జీవిత చరిత్ర, ఆశయాలు, రాజ్యాంగ విలువలు, సామాజిక సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటాన్ని ప్రతిబింబించే 'సంఘం శరణం గచ్ఛామి' నాటికను ఆదర్శవంతంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ఇల్లందు ఏరియా జనరల్ మేనేజర్ వీసం కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం నాటిక ప్రదర్శనను ప్రారంభించారు. అంబేద్కర్ బాల్యం నుంచి విద్యాభ్యాసం వరకు, ఆయన ఎదుర్కొన్న సామాజిక వివక్ష, విద్య ద్వారా సాధించిన ఉన్నత స్థానం, అణగారిన వర్గాల హక్కుల కోసం సాగించిన పోరాటం, భారత రాజ్యాంగ రూపకల్పనలో ఆయన పోషించిన కీలక పాత్ర వంటి అంశాలను కళాకారులు నాటిక రూపంలో భావోద్వేగభరితంగా ఆవిష్కరించారు. సమానత్వం, సామాజిక న్యాయం, మానవ హక్కుల కోసం అంబేద్కర్ చేసిన మహోన్నత కృషిని ప్రేక్షకులకు కళ్లకు కట్టినట్లు చూపించారు. నాటికను వీక్షించిన జనరల్ మేనేజర్ శ్రీ వి.కృష్ణయ్య కళాకారులప్రతిభనుఅభినందించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జీవితం, ఆయన ఆశయాలు, సమాజానికి అందించిన సేవలు, సమానత్వం, సామాజిక న్యాయం కోసం సాగించిన పోరాటాన్ని కళాకారులు అత్యంత అద్భుతంగా ప్రదర్శించారని ప్రశంసించారు.నాటిక ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో పాటు రాజ్యాంగ స్ఫూర్తి, సామాజిక సమానత్వం, సామాజిక బాధ్యతలపై ఆలోచింపజేసింది. సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, విద్యార్థులు, స్థానిక ప్రజల్లో కళా, సాంస్కృతిక కార్యక్రమాల పట్ల ఆసక్తిని పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నాటికలు, ఇతర కళారూపాలు ప్రభావవంతమైన మాధ్యమాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు.నాలుగు రోజుల సామాజిక చైతన్య నాటకోత్సవాల్లో భాగంగా రేపు 28.08.2026 (శుక్రవారం) ఇదే వేదికపై మహాత్మా జ్యోతిరావ్ ఫూలే, సావిత్రిబాయి ఫూలే జీవితాలు, ఆశయాలు, సామాజిక సంస్కరణలపై రూపొందించిన 'సత్యశోధన' నాటికను ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నాటక ప్రదర్శనకు కూడా సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి కె ఓ సి పి ఓ మాధవరావు కేవైసీ మేనేజర్ శ్రీనివాసరావు, అడిషనల్ మేనేజర్ ఉండం బ్రహ్మం మరియు ఇతర అధికారులు ఉద్యోగులు ఉద్యోగ కుటుంబ సభ్యులు పట్టణ ప్రజలు పాల్గొన్నారు..

# మాదక ద్రవ్యాల నియంత్రణ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఆగస్టు 27**



మంచిర్యాల జిల్లా లో మాదకద్రవ్యాల నియంత్రణ దిశగా అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో డిసిపి ఎ. భాస్కర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ లతో కలిసి జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్య రహిత మంచిర్యాల జిల్లా సాధనలో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఈ సంవత్సరం ఇప్పటి వరకు 49 కేసులు నమోదు చేయడం జరిగిందని, ఇందులో 103 మందిని గుర్తించడం జరిగిందని తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగదారులను గుర్తించి కోర్టు ద్వారా 30 మందిని డ్రగ్ డి-అడిక్షన్ కేంద్రాలకు తరలించి కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. విద్యా సంస్థలలో విద్యార్థులచే యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని, వారి ద్వారా ప్రతి నెల అవగాహన కార్యక్రమాలు, మాదకద్రవ్యాల నియంత్రణపై క్విజ్, డ్రాయింగ్ మొదలగు పోటీలను నిర్వహించాలని తెలిపారు. విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో బెల్ట్ షాపులు నిర్వహించడం, పొగాకు సంబంధిత ఉత్పత్తులను అమ్మడం నిషేధించడం జరిగిందని, ఆ దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మెడికల్, ఐటిఐ, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలలో నిత్యం మాదక ద్రవ్యాల వినియోగంపై విద్యార్థులను గమనిస్తూ మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలోని మద్యం దుకాణాలు నిర్ణీత సమయానికి మూసివేసేలా చర్యలు తీసుకోవాలని, బెల్ట్ షాపులను నియంత్రించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గంజాయి తదితర మొక్కల సాగు చేసే వారిని గుర్తించాలని తెలిపారు. డ్రగ్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో మెడికల్ షాప్ లను నిత్యం పర్యవేక్షించాలని, సరైన ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులను విక్రయించే షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీస్, రవాణా, జాతీయ రహదారులు, రోడ్లు భవనాలు, ఆర్.టి.సి., విద్యుత్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులతో రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు పటిష్టంగా అమలు చేయాలని, వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు, ఇతర రోడ్డు భద్రత సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని రోడ్లపై చెత్త, ఆటంకాలను వెంటనే తొలగించాలని, ట్రాఫిక్ పోలీసు విభాగం రోడ్లపై అనధికార వాహన నిలుపుదల, నిబంధనల ఉల్లంఘున పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లపై తక్కువ విజిబిలిటీ ఉన్న చోట్ల లైటింగ్ ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారులపై రంబుల్ స్ట్రిప్స్, లైటింగ్, జాగ్రత్త సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో రోడ్లపై అదుపు తప్పిన, ఓవర్ లోడెడ్ వాహనాలు, పరిమితికి మించి వేగంగా వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని, జిల్లాలో ఈ సంవత్సరం ఇప్పటి వరకు 95 లైసెన్సులు రద్దు చేయడం జరిగిందని, ఫిట్ నెస్ లేని స్కూల్ బస్సులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ట్రాఫిక్ పోలీసు అధికారులు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరి చేయడంలో కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో రోడ్డు భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని, గ్రామీణ ప్రాంతాలలో, అంతర్గత రహదారులలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని, జిల్లా వ్యాప్తంగా వేగ పరిమితి బోర్డులు, హెచ్చరిక బోర్డులు, జాగ్రత్త సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఓవర్ లోడింగ్, మితిమీరిన వేగం, డ్రంక్ అండ్ డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్ లపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లపై సంచరించే పశువులను అందుబాటులో ఉన్న గోశాలకు తరలించాలని, నూతన గోశాల ఏర్పాటుకు భూమిని కేటాయించడం జరిగిందని త్వరితగతిన పనులు చేపట్టి పూర్తి చేయాలని తెలిపారు. రహదారి ప్రమాదాలు, మరణాలు తగ్గించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, మంచిర్యాల, బెల్లంపల్లి, జైపూర్ ల ఏసిపిలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## వెలమ ఏ సి కన్వెన్షన్ హాలు ప్రారంభించిన ఎమ్మెల్యే...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఆగస్టు 27.**

జగిత్యాల జిల్లా కేంద్రంలో గురువారం పద్మనాయక వెలమ ఏ సి కన్వెన్షన్ ను ప్రారంభించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్, వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగ రావు ,కోరుట్ల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ . వెలమ సంఘం లో పేద మధ్యతరగతి మెరిట్ విద్యార్థుల విద్య అభివృద్ధి కి కృషి చేయాలని ఆకాంక్షించారు.. విద్య తోనే సామాజిక ఆర్థిక పురోగతి సాధ్యం. అందరి భాగస్వామ్యం తో సంఘం అభివృద్ధి సాధ్యం అవుతుంది. ఐక్యత తో కలిసి ఉండి వెలమ సంక్షేమ సంఘం ఉన్నతికి తోడ్పడాలి.. ఈ కార్యక్రమంలో వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆయిల్నేని సాగర్ రావు,ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ రావు,కార్యవర్గ సభ్యులు, మాజీ అధ్యక్షులు రాజేశ్వర్ రావు ,పురుషోత్తం రావు, ముప్పాళ్ళ రాంచందర్ రావు ,యాచమనేని వెంకటేశ్వర రావు, వెలమ సంఘం సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



## భూముల రీ సర్వే వివరాలు పక్కాగా నమోదు చేయాలి

- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

**(వెగ్గళం రాధాకిషన్ ప్రజాతీర్పు ఇల్లంతకుంట) ఆగస్టు 27**

సిరికొండ గ్రామంలో భూ భారతి కింద రోవర్ యంత్రంతో భూముల రీ సర్వే పనులు కొనసాగుతుండగా, గురువారం అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, అటవీ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. సర్వే వివరాలు ఎలా తీసుకుంటారో పరిశీలించి.. అడిగి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో భూ భారతి కింద భూముల రీ సర్వే పనులు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలో సర్వే పై రైతులకు ముందుగా సమాచారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, తహసీల్దార్ సురేష్ అధికారులు సిబ్బంది తదితరులు పాలుగోన్నారు



## ఘనంగా మాజీ కార్పొరేటర్ కౌడే పోచయ్య జన్మదిన వేడుకలు.

**మేడిపల్లి,ఆగస్టు 27 ( ప్రజాతీర్పు ):**

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పీర్జాదిగూడ మాజీ కార్పొరేటర్ కౌడే పోచయ్య జన్మదిన వేడుకలు ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలలో పలువురు రాజకీయ ప్రముఖులు, బి ఆర్ ఎస్ నేతలు, డివిజన్ నాయకులు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కౌడే పోచయ్యను ఘనంగా సన్మానించి, కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మీడియా ప్రతినిధులు కౌడే పోచయ్య అను సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని, భవిష్యత్తులో మరింత రాజకీయ ఉన్నతిని సాధించి ప్రజల కుమారింత మెరుగైన సేవ చేయాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు రాంపల్లి రమేష్ గౌడ్, బండారి శ్రీధర్, సిద్ధు, చంద్రశేఖర్, శ్రీనివాస్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## తీజ్ వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**(నారు కట్ల మధు ప్రజా తీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా ) ఆగస్టు 27**



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామంలో నిర్వహించిన తీజ్ పండుగ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలు, యువతులతో కలిసి సంప్రదాయ తీజ్ ఉత్సవాల్లో పాల్గొని వారికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.



## అడివి బిడ్డలకు దోమతెరలు పంపిణీ

- మానవత్వం చూపిన కొనాకళ్ల సత్యనారాయణ

**అశ్వారావుపేట, ఆగస్టు 27, (ప్రజా తీర్పు)**

దట్టమైన అడవి, ఎత్తైన కొండల మధ్య నివసిస్తున్న చెన్నాపురం ఆదివాసీ బిడ్డల బతుకులు చూస్తే కన్నీళ్లు ఆగవు, ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందని ఆ గ్రామంలో కనీస సదుపాయాలు కూడా కరువయ్యాయి, పసిబిడ్డలతో వర్షాకాలంలో వర్షానికి, ఎండాకాలంలో ఎండకు, చలికాలంలో చలికి వణుకుతూ, అడవిలో దొరికే పళ్లు, దుంపలు, వేర్లను తిని ఆకలి తీర్చుకుంటున్న దయనీయ స్థితి అక్కడ నెలకొంది. ప్రభుత్వ అధికారులు సైతం అడుగుపెట్టని ఆ మారుమూల గిరిజన గూడెంలో అనారోగ్యం వస్తే నాటు వైద్యమే దిక్కు, ముఖ్యంగా వర్షాకాలంలో దోమల బెడదతో చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న తిరుమలకుంట గ్రామానికి చెందిన కొనాకళ్ల సత్యనారాయణ మానవత్వంతో స్పందించారు, చెన్నాపురం గిరిజన బిడ్డలకు దోమతెరలు పంపిణీ చేసి వారి ప్రాణాలకు భరోసా కల్పించారు. ఇంతకాలం తమను ఎవరూ పట్టించుకోలేదని, ఇప్పుడు సత్యనారాయణ తమ బిడ్డల కోసం దోమతెరలు తెచ్చి ఇవ్వడంతో తమ కళ్లల్లో ఆనందం నిండిపోయిందని గ్రామ ప్రజలు కన్నీటితో కృతజ్ఞతలు తెలిపారు, అడవి బిడ్డలకు అండగా నిలిచిన కొనాకళ్ల సత్యనారాయణను గ్రామస్థులు మనసారా అభినందించారు.

## గోశాలలో పశువుల సంరక్షణపై ప్రత్యేక చర్యలు

**(నారు కట్ల మధు ప్రజా తీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ) ఆగస్ట్ 27**



శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం తిప్పాపూర్ గోశాలలో పశువుల ఆరోగ్యం, పరిశుభ్రతపై అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు అనారోగ్యంతో ఉన్న కోడెలకు ప్రత్యేక చికిత్స అందిస్తూ, ఇతర పశు వులకు అంటువ్యాధులు సోకకుండా ప్రత్యేక క్వారంటైన్ షెడ్ ఏర్పాటు చేశారు. గోశాలకు శాశ్వత వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ నియామకానికి ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు తెలిపారు. పశువుల సంరక్షణ, గోశాల పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు.

## గంజాయి కేసులో నిందితుడి అరెస్ట్ రిమాండ్‌కు తరలింపు

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఆగస్టు 27**



మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం దేవాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి వినియోగం, విక్రయాలపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. విశ్వసనీయ సమాచారం మేరకు బెల్లంపల్లి నివాసి ఎస్.కె . జమీర్ దేవాపూర్ ఎంపీపీఎస్ పాఠశాల ముందు, అనుమానాస్పదంగా నల్లరంగు కవర్‌తో ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి చేరుకుని అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద ఉన్న నల్లరంగు కవర్‌ను పోలీసులు తనిఖీ చేయగా, అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. అతని వద్ద నుండి 150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.అనంతరం నిందితుడిని విచారించగా, తన పేరు ఎస్.కె . జమీర్, తండ్రి మహబూబ్, వయస్సు 30 సంవత్సరాలు, కులం: ముస్లిం, వృత్తి: కూలీ, నివాసం: బెల్లంపల్లి బస్తీ అని తెలిపాడు. అదేవిధంగా, తనకు తెలిసిన గంజాయి వినియోగదారులైన ఘా2)ఎండీ .యోనిస్, ఘా3)చంటి, ఘా4)బన్ని, ఘా5)తాజ్ బాబా, ఘా6)విష్ణు, ఘా7)కిరణ్, ఘా8)సమీర్, ఘా9)అజయ్ వీరు బెల్లంపల్లి నివాసులు, గంజాయిని విక్రయించి డబ్బులు సంపాదించేవాడినని విచారణలో,వెల్లడించాడు.ఈ మేరకు నిందితుడు ఘా1) ఎస్.కె . జమీర్పై ఎన్ డి పి ఎస్ యాక్ట్ లోని సెక్షన్ 8(సి) తీ/ష 20(బి)(ఐఐ)(బి), 27(ఎ) కింద దేవాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అలాగే, మిగిలిన వ్యక్తులైన ఘా2 నుండి ఘా9 వరకు వారిపై ఎన్ డి పి ఎస్,యాక్ట్ లోని సెక్షన్ 27(బి ) కింద కేసు నమోదు చేశారు.తదుపరి చట్టపరమైన ప్రక్రియ అనంతరం నిందితుడు ఎస్ కే . జమీర్‌ను 27.08.2026 న కోర్టులో హాజరుపరచి, లక్సెట్టిపేట జైలుకు రిమాండ్‌కు,తరలించారు.ఈ సందర్భంగా దేవాపూర్ ఎస్ఐ ఎ. గంగారం, మాట్లాడుతూ, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వినియోగం, విక్రయాలు, అక్రమ రవాణాకు పాల్పడవద్దని సూచించారు.మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్తు నాశనం కావడంతో పాటు, కుటుంబాలపై మరియు సమాజంపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు ఆకర్షితులు కాకుండా తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల వినియోగం, విక్రయాలు లేదా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిసినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ ఎ. గంగారం కోరారు.

# బోడుప్పల్ ఈస్ట్ హనుమాన్ నగర్‌లో మైనింగ్ ఏడీ ఇంటిపై ఏసీబీ దాడులు.

- ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో సోదాలు.. 8 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు

**మేడిపల్లి, ఆగస్టు 27. ( ప్రజాతీర్పు )**



బోడుప్పల్: ఈస్ట్ హనుమాన్ నగర్‌లోని మైనింగ్ ఏడీ జయరాజు నివాసంపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం ఉదయం సోదాలు నిర్వహిస్తున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణల నేపథ్యంలో ఈ తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. ప్రస్తుతం జయరాజు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మైనింగ్ ఏడీగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. హైదరాబాద్ ఏసీబీ జాయింట్ డైరెక్టర్ సాయి మనోహర్, వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో అధికారులు ఈ సోదాలు నిర్వహిస్తున్నారు. జయరాజుకు సంబంధించిన ఇళ్లు, కార్యాలయాలు సహా మొత్తం 8 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు జరుగుతున్నట్లు సమాచారం. ఆస్తులకు సంబంధించిన పత్రాలు, బ్యాంకు లావాదేవీలు తదితర వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారు. సోదాల్లో ఇప్పటివరకు రెండు అంతస్తుల భవనం, రెండు కార్లు, రూ. 1.50 లక్షల నగదు, రెండు బైక్స్, జనగాం జిల్లాలో 5 ఎకరాల వ్యవసాయ భూమి, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పోస్టల్ డిపాజిట్లు గుర్తించినట్లు సమాచారం. అయితే సోదాలు ఇంకా కొనసాగుతున్నాయి. సోదాలు పూర్తైన అనంతరం ఆస్తుల విలువ, స్వాధీనం చేసుకున్న పత్రాలు, ఇతర వివరాలపై ఏసీబీ అధికారులు అధికారికంగా వెల్లడించే అవకాశం ఉంది.

# నిరంతరం శ్రమిస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షులు గోదారి అజయ్ డిమాండ్

**హుస్నాబాద్ ఆగస్టు 27 రవీందర్ ప్రజా తీర్పు**





పంచాయతీరాజ్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన ఉద్యోగుల మహాధర్నా కార్యక్రమం విజయవంతమైనట్లు పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షులు గోదారి అజయ్ కుమార్ తెలిపారు.జిల్లా అధ్యక్షులు గోదారి అజయ్ కుమార్ చిగురుమామిడి మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... కరీంనగర్ జిల్లా జేఏసీ అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి,సెక్రెటరీ కాల్ చరణ్ ల నేతృత్వంలో ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు.రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న పంచాయతీరాజ్ ఉద్యోగుల సమస్యలు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉండటం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్నోసార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా,వినతి పత్రాలు సమర్పించినా,చర్చలు జరిపినా ఫలితం లేకుండా పోయిందని మండిపడ్డారు. అనేక న్యాయపరమైన డిమాండ్లు ఇంకా పరిష్కారానికి నోచుకోలేదని వారు ధ్వజమెత్తారు.తీవ్ర జాప్యం జరుగుతున్న రెండో పీఆర్సీని వెంటనే అమలు చేయాలని,కొత్త వేతన స్కేల్‌ను తక్షణమే వర్తింపజేయాలన్నారు.పెండింగ్‌లో ఉన్న 6డీఏలను వెంటనే విడుదల చేయాలని,ఉద్యోగుల భవిష్యత్తుకు భరోసానిచ్చే పాత పెన్షన్ విధానాన్ని మరలా పునరుద్ధరించాలని,ఉద్యోగులకు ఆరోగ్య భద్రత కల్పిస్తూ,హెల్త్ కార్డులను వెంటనే జారీ చేయాలన్నారు.ఈ మహాధర్నా కార్యక్రమానికి కరీంనగర్ జిల్లా పంచాయతీ ఉద్యోగుల నుంచి భారీ స్పందన లభించింది.జిల్లా పంచాయతీ అధికారి జగదీష్, మహిళా అధ్యక్షురాలు శారద, సుమంత్ రావులతో పాటు ఎంపీడీవోలు వేణుగోపాల్, రాము,ఎంపీవోలు బండ రాజశేఖర్,సతీష్ పాల్గొని మద్దతు తెలిపినట్లు చెప్పారు.ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు.అలాగే పంచాయతీ కార్యదర్శుల యూనియన్ తరపున గౌరి రమేష్, మనోహర్ రెడ్డి, రేవంత్ రెడ్డి, మహేందర్ రావు, చంద్రశేఖర్, బండ ప్రసాద్, కిరణ్ కుమార్ రెడ్డి, వాహెజ్, మమత, సుస్మిత, లావణ్యలతో పాటు జిల్లావ్యాప్తంగా ఉన్న పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేసినట్లు అజయ్ కుమార్ వివరించారు.



## కాపర్,అల్యూమినియం చోరీ నిందితులు అరెస్ట్

వివరాలు వెల్లడించిన ఏసీపీ సదానందం

**హుస్నాబాద్ ఆగస్టు 27 రవీందర్ ప్రజా తీర్పు**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని కోహెడ మండల పరిధిలో కాపర్, అల్యూమినియం వైర్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరి నిందితులను పట్టుకుని రిమాండ్ కు తరలించినట్లు ఏసీపీ సదానందం వెల్లడించారు. కోహెడ మండల శివారులో వెంకటేశ్వరపల్లి, ఆరేపల్లి, బస్వాపూర్ గ్రామ శివారులో ట్రాన్స్ ఫార్మర్ పగలగొట్టి కాపర్, అల్యూమినియం వైర్ లు మరియు తంగళ్ళపల్లి గ్రామాల శివారులో రైతుల వ్యవసాయ పొలాల వద్ద గల కరెంట్ మోటార్ వైర్ లు దొంగతనాలకు పాల్పడుతున్న కరీంనగర్ జిల్లా సోమారం గ్రామానికి చెందిన లోకిని మహేష్, హన్మకొండ గోకుల్ నగర్ కు చెందిన దేవర రాజశేఖర్ లు గురువారం దొంగతనం చేసిన కాపర్ వైర్ లను వారితో పాటు తెచ్చుకున్న ప్యాసెంజర్ ఆటోలో తీసుకువస్తుండగా కోహెడ పోలీస్ లు సముద్రాల గ్రామం ఎక్స్ రోడ్డు వద్ద పట్టుకొని వారి వద్ద నుండి ప్యాసింజర్ ఆటో, 10 కిలోల ట్రాన్స్ఫర్మర్ కాపర్ వైర్,100 కిలోల అల్యూమినియం వైర్ స్వాధీనం చేసుకున్నారు. కాగా కొందరు దొంగలు పరారీలో ఉన్నారని వెల్లడించారు.చోరీ కేసు చేదనలో ప్రతిభ కనబర్చిన హుస్నాబాద్ సీఐ శ్రీధర్, కోహెడ యస్.ఐ అభిలాష్, హెడ్ కానిస్టేబుల్ సంపత్, కానిస్టేబుల్ వేణు లను హుస్నాబాద్ ఏసిపి సదానందం అభినందించారు.

## అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు పొందుకోవాలి...

తహశీల్దార్ కనకయ్య

**హుస్నాబాద్ ఆగస్టు 27 రవీందర్ ప్రజా తీర్పు**



దేశంలో అర్హత ఉన్న ప్రతీ పౌరుడు ఒకే ఓటు హక్కు కలిగి ఉండాలని చిగురుమామిడి తహశీల్దార్ కనకయ్య అన్నారు.గురువారం మండలంలోని ఇందుర్తి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఎలక్షన్ కమిషనర్ ఆదేశాల మేరకు ఓటర్ల ప్రత్యేక సవరణ ఎస్ఐఆర్ కార్యక్రమంపై గ్రామసభ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హాజరైన తహసీల్దార్ కనకయ్య ఓటర్ల జాబితా వివరాలు వెల్లడించారు,ఎస్ఐఆర్ పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పలు సూచనలు చేశారు.చట్ట ప్రకారం దేశంలో ప్రతీ పౌరుడికి ఒకే ఓటు హక్కు ఉండాలని,రెండు ఓట్లు కలిగి ఉండడం నేరమని స్పష్టం చేశారు.గ్రామంలో డబుల్ ఓట్లు,మరణించిన వారి ఓట్లు తొలగించామని గ్రామంలో 204 మందికి నాన్ మ్యాపింగ్ ఓట్లు జరిగాయన్నారు.వీటికి సంబంధించి గ్రామంలో నోటీసులు అందించి సంబంధిత ఓటర్లకు నోటీసులు ఇచ్చామన్నారు.ఈ నోటీసులు అందిన 142 మంది ఓటర్లు సంబంధిత ఆధారాలతో తహశీల్దార్ ముందు హాజరుకాగా,సరైన వివరాలు అందించని వారికి,అందుబాటులో లేని వారికి నోటీసులు జారీ చేశామన్నారు.నేటి నుండి అక్టోబర్ 17వ తారీఖు వరకు మండలంలోని అన్ని గ్రామాలలో హియరింగ్ నిర్వహిస్తామన్నారు.అక్టోబర్ 19వ తేదీన ఓటర్ల తుది జాబితా విడుదల అవుతుందన్నారు. చిన్న చిన్న తప్పులు,పేర్లు చిరునామా లేదా కుటుంబ సభ్యుల ఓట్లను ఒకే పోలింగ్ కేంద్రానికి మార్చుకోవడానికి ఫారం-8 ని నింపి సంబంధిత అధికారికి లేదా బిఎల్ఓకు ఇచ్చిసరిచేసుకోవాలన్నారు.ఈ ఏడాది అక్టోబర్ 1వ తేది వరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు నమోదు కొరకు ఫారం-6 నింపి ఓటరు జాబితాకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.ఈ గ్రామ సభ సమావేశానికి గ్రామ సర్పంచ్ చింతపుల నరేందర్,ఆర్ఐ నాగరాజు,జిపిఓ బాలయ్య శ్రీనివాస్, బిఎల్ఓలు కుట్ల విజయ,మవురవ్వ, లక్ష్మి,వార్డు మెంబర్లు ఓటర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

## నర్సంపేటలో ఘనంగా తీజ్ పండుగ వేడుకలు

**నర్సంపేట, ఆగస్టు 27 (ప్రజాతీర్పు)**

తీజ్ పండుగ బంజారా/గోర్ సమాజంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన సంప్రదాయ పండుగ. ఇది ముఖ్యంగా స్త్రీలు, యువతులు ప్రకృతి, పంటలు, కుటుంబ సుఖసంతోషాలు మరియు సమాజ శ్రేయస్సు కోసం భక్తిశ్రద్ధలతో నిర్వహించే పండుగగా కొనసాగుతోంది. బంజారా సంప్రదాయంలో తీజ్ సందర్భంగా గోధుమ గింజలను నానబెట్టి మొలకలు పెంచడం ప్రధాన ఆచారం. వాటిని ప్రత్యేకంగా అలంకరించి, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ పాటలు పాడటం, నృత్యాలు చేయడం ద్వారా తమ సంస్కృతి, సంప్రదాయాలను తరతరాలకు అందిస్తున్నారు. తీజ్ పండుగకు సేవాలాల్ మహారాజ్, మేరమా యాడి వంటి ఆధ్యాత్మిక విశ్వాసాలతో కూడా సంబంధం ఉంది. పండుగ రోజుల్లో యువతులు సంప్రదాయ దుస్తులు ధరించి, సమూహంగా పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఈ పండుగ కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమం మాత్రమే కాకుండా బంజారా జాతి ఐక్యత, సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతితో ఉన్న అనుబంధాన్ని ప్రతిబింబించే వేడుకగా నిలుస్తోంది. ఆధునిక కాలంలోనూ తీజ్ పండుగ ద్వారా యువతకు తమ పూర్వీకుల ఆచారాలు, సంస్కృతి గురించి అవగాహన కల్పిస్తున్నారు.కావున ఈ రోజు తొమ్మిదోవ రోజు కావడం తో ఎంతో భక్తి శ్రద్ధ లతో తీజ్ నిమజ్జనం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమం లో రాయ్ ఫిట్నెస్ స్టూడియో సభ్యులు , నర్సంపేట గౌరవ నాయకులు, మరియు గోర్ సేన వరంగల్ జిల్లా అధ్యక్షుడు భూక్యా మత్రు రాథోడ్, ప్రధాన కార్యదర్శి, మీడియా వింగ్ ఇంచార్జ్ భూక్యా వెంకన్న రాథోడ్,వరంగల్ జిల్లా గోర్ శిక్షాడీ అధ్యక్షుడు బాబు,నర్సంపేట డివిజన్ ఉపాధ్యక్షుడు బోడ సురేష్, ప్రధాన కార్యదర్శి బానోత్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.











## నర్సంపేటలో అంగరంగ వైభవంగా బంజారాల 'తీజ్' వేడుకలు

**నర్సంపేట రూరల్,ఆగస్టు 27, ప్రజా తీర్పు ప్రతినిధి:**

నర్సంపేట నియోజకవర్గ వ్యాప్తంగా బంజారా (లంబాడీ) గిరిజనుల ఆరాధ్య పండుగ, సంస్కృతీ సంప్రదాయాల ప్రతీక అయిన తీజ్ ఉత్సవాలు అంగరంగ వైభవంగా ముగిశాయి. శ్రావణ మాసంలో భక్తిశ్రద్ధలతో తొమ్మిది రోజుల పాటు సాగిన ఈ వేడుకలు, భక్తిపారవశ్యం మరియు సంప్రదాయ ఆటపాటల నడుమ కన్నులపండువగా నిర్వహించబడ్డాయి. ?సంతాన ప్రాప్తి, సకల శుభాల కోసం ప్రత్యేక పూజలు?పెళ్లికాని గిరిజన యువతులు మంచి జీవిత భాగస్వామి లభించాలని, తండాలు పచ్చదనంతో శోభిల్లాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ తొమ్మిది రోజుల పాటు అత్యంత నిష్ఠతో ఉపవాస దీక్షలు చేపట్టారు. అడవి నుంచి తెచ్చిన పుట్టమన్నుతో వెదురు బుట్టలలో గోధుమలను చల్లి, రోజుకు మూడు పూటలా నీరు పోస్తూ 'తీజ్' (గోధుమ మొలకలను) కంటికి రెప్పలా కాపాడుకున్నారు.

### సంప్రదాయ దుస్తుల్లో డప్పు చప్పుళ్లు నృత్యాల సందడి

ఉత్సవాల్లో భాగంగా బంజారా యువతులు, మహిళలు తమ సాంప్రదాయ రంగురంగుల దుస్తులు, కడియాలు, ఆభరణాలు ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తమ ఆరాధ్య దైవాలైన సంత్ సేవాలాల్ మహారాజ్, యాడి మేరామా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తండా పెద్దల ఆశీర్వాదాలు తీసుకుని, గిరిజన జానపద గేయాలు ఆలపిస్తూ డప్పు చప్పుళ్లకు అనుగుణంగా చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

### కన్నులపండువగా తీజ్ బుట్టల నిమజ్జనం

ఉత్సవాల ముగింపు సందర్భంగా యువతులు తమ తలలపై తీజ్ (గోధుమ మొలకల) బుట్టలను ఉంచుకుని తండా వీధుల గుండా కోలాహలంగా శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం స్థానిక చెరువులు, వాగులలో తీజ్ బుట్టలను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేయడంతో పండుగ వేడుకలు ప్రశాంతంగా, వైభవంగా ముగిశాయి. ఈ తీజ్ వేడుకలు నర్సంపేట ప్రాంతంలో గిరిజన సంస్కృతికి మరియు సఖ్యతకు అద్దం పడుతూ, పండుగ వాతావరణాన్ని నింపాయి.

## సహచరులతో పోలీసుల రాఖి పండుగ

- పోలీసులకు రాఖి కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపిన శ్రీమతి గడ్డం శ్రీదేవి

**వినోద్, ప్రజా తీర్పు, నేరెడ్మేట్, ఆగష్టు 27**



మల్కాజ్గిరి కమిషనర్ బి . సుమతి , ఐపీఎస్ ఆదేశాల మేరకు మల్కాజ్గిరి కమిషనరేట్లో నేరెడ్మేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళ స్వయం సహాయక సంఘాలు వారితో కలిసి రాఖీ పండుగ జరుపుకోవడం జరిగింది. ఇందులో భాగంగా భగత్ సింగ్ నగర్ మహిళ సంఘాల సమాఖ్య గ్రూప్ లీడర్ గడ్డం శ్రీదేవి తన నివాసం లో నేరేడ్మెట్ పోలీస్ అధికారులు శ్రీనివాస్ రెడ్డి,రాజు గార్లకు రాఖీ కట్టి పండుగ జరుపుకోవడం ప్రత్యేక ఆకర్షణ నిలించింది. పోలీస్ అధికారులు మహిళలకు చట్టాలపై అవగాహన కల్పిస్తూ, అదేవిధంగా మన ప్రాంతాలలో జరిగే అసాంఘిక కార్యకలాపాల పట్ల వారు కూడా తమవంతుగా నేర నియంత్రణలో పోలీసు వారితో ముందుండి నడవాలని చెప్పి వారితో మాట్లాడడం జరిగింది.



## బిఆర్ఎస్ పార్టీలోకి చేరిన కాంగ్రెస్ బిజెపి నాయకులు

- కండవు కప్పి ఆహ్వానించిన మాజీ మంత్రివర్యులు గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) ఆగస్టు 27**

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం గ్రామం నుండి కాంగ్రెస్ బిజెపి నుండి మాజీ మంత్రివర్యులు సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి మరియు తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు గాదరి కిషోర్ కుమార్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరిన జీడి వెంకటేశ్వర్లు బూరుగుల రాంబాబు తో పాటు మరికొంతమందికి కండువా కప్పి ఆహ్వానించారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మారిపెద్ది శ్రీనివాస్ గౌడ్,మండల పార్టీ అధ్యక్షులు గుండ గాని సోమేశ్ మాజీ జెడ్పీటీసీ సభ్యులు దావుల వీరప్రసాద్ యాదవ్ తిమ్మాపురం సర్పంచ్ బొడ్డు ఇందిరా సోమరాజు విద్యా కమిటీ మాజీ చైర్మన్ తొండలింగమూర్తి ఉపసర్పంచ్ దేశిడి సందీప్ రెడ్డి వార్డు సభ్యులు మంగదుడ్ల సత్యనారాయణ ఆదె మధు కోడబోయిన నరసయ్య చెరుకుపల్లి ప్రవీణ్ మేడబోయిన గంగయ్య యాదవ్ గార్లు పాల్గొన్నారు

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, RNI Reg no. APTEL/2001/5268 printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020